

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 70 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఎన్.టి.ఆర్ జిల్లా మంగళవారం 24 మార్చి 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 70 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : NTR DIST, TUE 24 MARCH 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur

## ఇంధన భయం వద్దు..41 దేశాల నుంచి ఇంధన దిగుమతులు



- ఎల్పీజీ అవసరాల్లో 60శాతం దిగుమతులపై ఆధారం
- గల్ఫ్ లోని భారతీయుల భద్రతకు ప్రాధాన్యం
- పశ్చిమాసియా నుంచి 3.75 లక్షల మంది భారతీయులను రప్పించాం
- ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు, ప్రజల జీవితాలపై తీవ్ర ప్రభావం
- మూడు వారాలుగా కొనసాగుతున్న ఘర్షణపై ప్రధాని ఆందోళన
- లోక్ సభలో మాట్లాడిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ

**పెన్ పవర్ డెస్క్:** పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నప్పటికీ దేశానికి ఇంధన సరఫరాపై ఎలాంటి అంతరాయం రాకుండా కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. పార్లమెంట్? లో చేసిన ప్రకటనలో యుద్ధ ప్రభావాలను తగ్గించేందుకు నిరంతరం కృషి కొనసాగుతుం దని, అన్ని రంగాల భాగస్వాములతో సమన్వయం చేస్తూ ప్రభావితులకు అవసరమైన మద్దతు అందిస్తున్నామని తెలిపారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ సరఫరా దేశవ్యాప్తంగా కొనసాగుతూనే ఉంటుందని అన్నారు.

మిగతా 2లో

## రోజుకు 1.5జీబీ డేటా వాడుకోమని ఇచ్చి.. డేటా మిగిలితే మిడ్ నైట్‌కు మాయం చేయడం ఏంటి ?



**పెన్ పవర్ డెస్క్:** టెలికాం కంపెనీల డైలీ డేటా ప్లాన్స్‌పై ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ రాఘవ్ చద్దా రాజ్యసభలో గళమెత్తారు. టెలికాం కంపెనీలు డైలీ డేటా లిమిట్ ప్లాన్స్‌ను తీసుకొచ్చాయని.. డైలీ డేటా ప్లాన్స్ 1.5 జీబీ, 2జీబీ, 3జీబీ 24 గంటల వ్యాలిడిటీతో అందిస్తున్నాయని ఆయన గుర్తుచేశారు. ప్రతీ 24 గంటలకు ఈ రీఛార్జ్ ప్లాన్‌లో భాగంగా డేటా రీసెట్

మిగతా 2లో

- అనకాపల్లి జిల్లాలో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు నేడు భూమిపూజ
- రాజయ్యపేటలో రూ.1.35 లక్షల కోట్ల భారీ పెట్టుబడితో ప్లాంట్ ఏర్పాటు
- హాజరైన సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి కుమారస్వామి, పవన్ కల్యాణ్, నారా లోకేశ్
- 2029 నుంచి ఉత్పత్తి ప్రారంభం లక్ష్యంగా నిర్మాణం




# ఏపీలో అతిపెద్ద స్టీల్ ప్లాంట్...

## శంకుస్థాపన చేసిన సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి కుమారస్వామి



**పెన్ పవర్ డెస్క్:** ఆంధ్రప్రదేశ్‌లో అనకాపల్లి జిల్లా నక్కపల్లి సమీపంలోని రాజయ్యపేటలో అతిపెద్ద స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నారు. రూ.1,35,964 కోట్ల భారీ పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్‌కు నేటి సాయంత్రం భూమిపూజ నిర్వహించారు. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి ఈ ప్లాంట్ కీలకం కానుంది. ఈ కార్యక్ర మానికి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, కేంద్ర సహాయమంత్రి శ్రీనివాస వర్మ, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, ఆర్సెలార్ మిట్టల్ అధినేత లక్ష్మీ మిట్టల్, కంపెనీ ప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. అనంతరం వారు శిలాఫలకం ఆవిష్కరించారు. అంతకుముందు, స్టీల్ ప్లాంట్ నిర్మాణ నమూనాను లక్ష్మీ మిట్టల్.. సీఎం చంద్రబా బు, కేంద్ర మంత్రి కుమారస్వామికి వివరించారు. అనంతరం, నేతలందరూ ప్లాంట్ స్థలంలో ఏర్పాటు చేసిన ఎక్స్‌పీరియన్స్ జోన్‌ను సందర్శించారు. రాజయ్యపేటలో నిర్మిస్తున్న ఈ ప్లాంట్ ద్వారా ఏడాదికి 17.8 మిలియన్

మిగతా 2లో

## 20 నెలల్లోనే ఆర్సెలర్ మిట్టల్ ను తీసుకొచ్చాం...

# ఇదీ మా స్పీడు

- అనకాపల్లిలో ఆర్సెలర్ మిట్టల్ ఉక్కు కర్మాగారానికి శంకుస్థాపన
- లక్ష మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు కల్పనే లక్ష్యం
- రెండు దశల్లో 17.8 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి చేయనున్న పరిశ్రమ
- 20 నెలల్లోనే ప్రాజెక్టును సాకారం చేశామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- స్టీల్ ప్లాంట్‌తో పాటు రూ.11,198 కోట్లతో క్యాప్టివ్ పోర్టు, ప్రత్యేక రహదారి నిర్మాణం



**పెన్ పవర్ డెస్క్:** ఉత్తరాంధ్ర అభివృద్ధిలో మరో చారిత్రక అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో ప్రపంచ ప్రఖ్యాత ఆర్సెలర్ మిట్టల్-నిప్పన్ స్టీల్ ఇండియా (ఆవీ/బీూ ×అఒఱఖ) ఏర్పాటు చేయనున్న భారీ ఉక్కు కర్మాగారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు లక్ష మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన ప్రకటించారు. కేవలం 20 నెలల వ్యవధిలోనే 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానంలో ఈ భారీ ప్రాజెక్టును సాకారం చేసి చూపించామని చంద్రబాబు అన్నారు. ఇది కేవలం స్టీల్ ప్లాంట్ కాదని, భవిష్యత్తులో ఓ స్టీల్ సిటీకి పునాది అని ఆయన అభివర్ణించారు.

### స్టీల్ ప్లాంట్ కాదు.. స్టీల్ సిటీ


రెండు దశల్లో నిర్మితమయ్యే ఈ ఉక్కు పరిశ్రమ ద్వారా ఏటా 17.8 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి అవుతుందని ముఖ్యమంత్రి వివరించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా రూ.11,198 కోట్ల వ్యయంతో క్యాప్టివ్ పోర్టు కూడా నిర్మిస్తున్నట్లు తెలిపారు. పరిశ్రమకు అవసరమైన ముడి ఇనుము సరఫరా కోసం ప్రత్యేక పైప్‌లైన్, జాతీయ రహదారిని అనుసంధానిస్తూ

మిగతా 2లో

## ఇరాన్‌తో యుద్ధాన్ని తాత్కాలికంగా ఆపేస్తున్నాం

### డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన

- 5 రోజుల పాటు యుద్ధాన్ని నిలిపివేస్తున్నట్లు ట్రంప్ ప్రకటన
- రెండు రోజులుగా ఇరాన్, అమెరికా మధ్య జరిగిన చర్చలు సానుకూలంగా సాగాయని వెల్లడి
- ఇరాన్ విద్యుత్ కేంద్రాలపై దాడులు ఆపేస్తున్నామని ప్రకటన



**పెన్ పవర్ డెస్క్:** పశ్చిమాసియాలో యుద్ధానికి తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఈ మేరకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఇరాన్‌పై యుద్ధాన్ని తాత్కాలికంగా ఆపేస్తున్నామని ఆయన తన ట్రూత్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. 5 రోజుల పాటు యుద్ధాన్ని నిలిపివేస్తున్నామని వెల్లడించారు. ఇరాన్ విద్యుత్ కేంద్రాలపై

మిగతా 2లో

## 'రీల్' లైఫ్‌లోనైనా సీఎం అవుతా.. రేవంత్ రెడ్డిని నేనే ముఖ్యమంత్రిని చేశా

- వెండి తెరపై సీఎం రోల్ పోషించాలని ఉందన్న మల్లారెడ్డి
- తాను, రేవంత్ రెడ్డి అన్నదమ్ములమేనని వ్యాఖ్య
- 'ఉస్తాద్ భగత్ సింగ్'లో తనకు విలన్ ఆఫర్ వచ్చిందని వెల్లడి



మిగతా 2లో



## చంద్రబాబు విధానాలు భరోసానిచ్చాయి...

### ఇది లక్షల ఉద్యోగాలు కల్పించే గ్రోత్ ఇంజిన్

- అనకాపల్లిలో ఆర్సెలార్ మిట్టల్-నిప్పన్ స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన
- లక్ష మందికి ఉపాధి కల్పిస్తుందన్న లక్ష్మీ మిట్టల్
- ఈ ప్రాంతానికి గ్రోత్ ఇంజన్‌గా మారుతుందని వెల్లడి
- సీఎం చంద్రబాబు పారిశ్రామిక విధానాలపై ప్రశంసలు

**పెన్ పవర్ డెస్క్:** అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో ప్రతిపాదిత ఆర్సెలార్ మిట్టల్-నిప్పన్ స్టీల్ ప్లాంట్‌కు సోమవారం శంకుస్థాపన జరిగింది. ఈ సందర్భంగా ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ లక్ష్మీ ఎన్ మిట్టల్ మాట్లాడుతూ,

మిగతా 2లో

### వాలంటీర్ల సాయంతో భూ కబ్జాకు యత్నించారంటూ

## వైసీపీ నేతలపై గ్రీవెన్స్ లో ఫిర్యాదు

- టీడీపీ కేంద్ర కార్యాలయంలోని గ్రీవెన్స్‌కు వెల్లువెత్తిన భూ బాధితులు
- పీర్ల చావిడి మాన్యం, అసైన్డ్ భూములను సైతం వదలని అక్రమార్కులు
- అధికారులు, పోలీసులు నిందితులకు కొమ్ముకాస్తున్నారని బాధితుల ఆరోపణ
- ఫిర్యాదులను స్వీకరించి, న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన నేతలు

**పెన్ పవర్ డెస్క్:** తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ (గ్రీవెన్స్) కార్యక్రమం భూ బాధితుల ఆవేదనలతో నిండిపోయింది. గత ప్రభుత్వంలోని వైసీపీ నేతలు,

మిగతా 2లో



### పోలీసుల తీరుపై అంబటి ధ్వజం.. అవసరమైతే

## సుప్రీంకోర్టుకు వెళతానని హెచ్చరిక

- 7 గంటల పాటు తన ఆస్తులపై దాడి చేసి విధ్వంసం సృష్టించారన్న అంబటి
- దాడి చేసిన వారికి స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపారని విమర్శ
- తనను మాత్రం 18 రోజులు జైలుకు పంపారని మండిపాటు
- ఈ ఘటనపై విచారణకు సిట్ ఏర్పాటు చేయాలని డిమాండ్

**పెన్ పవర్ డెస్క్:** తన నివాసం, కార్యాలయంపై జరిగిన దాడి ఘటనలో పోలీసు ల వ్యవహారశైలిని నిరసిస్తూ మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు సంచలన నిర్ణయం తీసుకున్నారు. జనవరి 31న సుమారు 7 గంటల పాటు

మిగతా 2లో



## నారా లోకేశ్ తండ్రికి తగ్గ తనయుడు అనిపించుకున్నారు

- అనకాపల్లిలో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన
- రూ.1.35 లక్షల కోట్ల భారీ పెట్టుబడితో రానున్న పరిశ్రమ
- సీఎం చంద్రబాబు నాయకత్వంపై కేంద్రమంత్రి కుమారస్వామి ప్రశంసలు
- ఈ ప్లాంట్ కార్యరూపం దాల్చడంలో లోకేశ్ కృషి ఉందని కితాబు విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ఆదుకుంటామని స్పష్టమైన హామీ



మిగతా 2లో

# ఎడిటర్ వ్యూ

## ప్రపంచాన్ని వణికిస్తున్న చమురు మంటలు

ఇరాన్‌పై అమెరికా తీసుకున్న తాజా సైనిక–రాజకీయ చర్యలు, వాటి తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు ప్రపంచ రాజకీయాల్లో ఒక కీలక మలుపును సూచిస్తున్నాయి. ప్రారంభ దశలో ఈ ఘర్షణను "త్వరగా ముగిసే పరిమిత యుద్ధం"గా భావించిన అమెరికా వ్యూహకర్తలు, ఇప్పుడు దీర్ఘకాలిక సంఘర్షణ, గ్లోబల్ ఆర్థిక ప్రభావాలు, మిత్ర దేశాలపై ఒత్తిడి వంటి అనేక సంక్లిష్టతలను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో "అమెరికా ఇరాన్‌ను తక్కువ అంచనా వేసిందా?" అనే ప్రశ్నకు సమాధానం కోసం పూర్వాపరాలు, వ్యూహపరమైన అంచనాలు, ప్రస్తుత పరిస్థితులు అన్నీ విశ్లేషణకు వస్తాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం చేపట్టిన విధానం "శక్తి ప్రదర్శన ద్వారా వేగవంతమైన ఫలితం" అనే సిద్ధాంతంపై ఆధారపడి ఉంది. 2025లో ఇరాన్ అణు కేంద్రాలపై దాడులు, 2026లో వ్యూహాత్మక మౌలిక వసతులపై లక్ష్యబద్ధ దాడులు, మరియు "మ్యాక్సిమమ్ ప్రెషర్" విధానం? కలిసి ఇరాన్‌ను బలహీన పరచి త్వరగా వెనక్కి తగ్గిస్తుందని అమెరికా భావించింది. ట్రంప్ పలు సందర్భాల్లో ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని "తగ్గించాం, దాదాపు నిర్వీర్యం చేశాం" అని ప్రకటించడం కూడా ఈ అంచనాలకే సంకేతం. కానీ వాస్తవ పరిస్థితి పూర్తిగా భిన్నంగా మారింది. ఇరాన్ ప్రత్యక్ష యుద్ధానికి మాత్రమే కాకుండా అసమాన యుద్ధ వ్యూహాలకు ప్రసిద్ధి. హోర్ముజ్ జలసంధిని మూసివేయడం, గల్ఫ్ దేశాలపై పరోక్ష దాడులు, మిత్ర దేశాల ఆర్థిక వ్యవస్థలను లక్ష్యంగా చేసుకోవడం వంటి చర్యల ద్వారా అది ప్రతిస్పందించింది. ప్రపంచ చమురు సరఫరాలో సుమారు 20% ఈ మార్గం ద్వారా జరుగుతుండటంతో, ఈ మార్గం మూసివేత ప్రపంచ మార్కెట్లను కుదిపేసింది అమెరికా మొదట భావించిన కీలక అంచనా?ఇరాన్ నాయకత్వంపై దాడి చేస్తే దేశం వెనక్కి తగ్గుతుందన్నది. కానీ ఇరాన్ రాజకీయ వ్యవస్థ వ్యక్తి ఆధారితమైనది కాదు; అది సిద్ధాంత ఆధారిత వ్యవస్థ. ఖమేని వంటి నాయకుడిని లేదా సైనిక నాయకులను లక్ష్యంగా చేసుకున్నా, వ్యవస్థ కొనసాగుతుంది. అంతేకాక, ఇరాన్‌లో "బాహ్య శత్రువు" భావన ప్రజలను ఒకే జెండా కింద చేర్చే సామర్థ్యం కలిగి ఉంది. అందువల్ల నాయకత్వంపై దాడులు దేశాన్ని బలహీన పరచడంలో కంటే ప్రతిఘటనను పెంచే అవకాశమే ఎక్కువ. అమెరికా మరో పెద్ద పొరపాటు?ఈ ఘర్షణ కాల వ్యవధిపై చేసిన అంచనా. ప్రారంభంలో ఇది కొన్ని రోజులు లేదా వారాల్లో ముగిసే ఘర్షణగా భావించ బడింది. కానీ ఇది నాలుగు వారాలకు పైగా కొనసాగుతూ, మరింత తీవ్రతరమవుతోంది. విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, "త్వరగా ముగుస్తుంది" అన్న భావన ఇప్పుడు పూర్తిగా చెదిరి పోయింది. దీర్ఘకాలిక యుద్ధం వైపు పరిస్థితి మళ్లింది. చమురు ధరల విషయంలో కూడా అమెరికా అంచనాలు తప్పి పోయాయి. యుద్ధం ప్రారంభానికి ముందు బ్యారెల్‌కు సుమారు వి70 ఉన్న చమురు ధరలు, ఇప్పుడు వి100?వి113 స్థాయికి చేరుకున్నాయి. ఇది కేవలం ఇంధన రంగానికే పరిమితం కాకుండా, ప్రపంచ వ్యాప్తంగా ద్రవ్యోల్బణం, ఉత్పత్తి ఖర్చులు, రవాణా ఖర్చులు పెరగడానికి దారితీసింది. ఈ సంక్షోభం 1970ల ఎనర్జీ షాక్‌లను తలపించే స్థాయికి చేరే ప్రమాదం ఉంది. అమెరికా వ్యూహకర్తలు దీర్ఘకాలంలో చమురు ధరలు తగ్గుతాయని కూడా భావించారు. ఇరాన్ ప్రభావాన్ని తగ్గిస్తే "టెరర్ ప్రీమియం" తగ్గి ధరలు పడిపోతాయని వాదనలు వినిపించాయి. కానీ తక్షణ ప్రభావం పూర్తిగా వ్యతిరేకంగా వచ్చింది?మార్కెట్లలో అనిశ్చితి పెరిగి ధరలు మరింత పెరిగాయి. మిత్ర దేశాల అంశంలో కూడా అమెరికా వ్యూహం చిక్కుల్లో పడింది. యూరప్ వంటి దేశాలు ఇంధన దిగుమతులపై ఎక్కువగా ఆధార పడటంతో, ఈ సంక్షోభం వారికి తీవ్రమైన ఆర్థిక ఒత్తిడిని తెచ్చింది. గ్యాస్ ధరలు రెట్టింపు కావడం, పరిశ్రమలపై ప్రభావం, వ్యవసాయ రంగంలో ఇన్‌పుట్ ఖర్చుల పెరుగుదల?కలిసి ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదిపేస్తున్నాయి. అమెరికా మిత్ర దేశాలకు మరో సమస్య భద్రతా పరమైనది. ఇరాన్ స్పష్టంగా హెచ్చరించింది?అమెరికా మద్దతు ఇచ్చే దేశాలపై కూడా దాడులు చేస్తామని. గల్ఫ్ ప్రాంతంలో ఉన్న అమెరికా సైనిక స్థావరాలు, ఆయిల్ సదుపాయాలు లక్ష్యంగా మారే అవకాశం ఉంది. దీని వల్ల మిత్ర దేశాలు "అమెరికా నిర్ణయాల భారం" మోయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక ఆర్థికంగా కూడా అమెరికా తానే ఒత్తిడిని ఎదుర్కొంటోంది. పెట్రోల్ ధరలు పెరగడం, స్టాక్ మార్కెట్లలో అనిశ్చితి, వడ్డీ రేట్లపై ఒత్తిడి? కలిసి దేశీయ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయి. అంతేకాక, దీర్ఘకాల యుద్ధం జరిగితే అమెరికా సైనిక ఖర్చులు కూడా పెరిగే అవకాశం ఉంది. ఇరాన్‌ను తక్కువ అంచనా వేసిన అంశం ఇక్కడ స్పష్టమవుతుంది. ఇరాన్ కేవలం ఒక దేశం మాత్రమే కాదు; అది ఒక ప్రాంతీయ ప్రభావ వ్యవస్థ. హిజ్బుల్లా, హూతీలు, షియా మిలీషియాలు వంటి మిత్ర బలగాల ద్వారా పరోక్ష యుద్ధాన్ని కొనసాగించే సామర్థ్యం ఉంది. ఈ "మల్టీ–లేయర్డ్ వార్ స్ట్రాటజీ"ను అమెరికా పూర్తిగా అంచనా వేయలేక పోయింది. ట్రంప్ ప్రభుత్వం మూడు ప్రధాన అంచనాల్లో పొరపాటు చేసింది. మొదటిది?త్వరగా ముగిసే యుద్ధం అనే అంచనా. రెండవదినాయకత్వంపై దాడి చేస్తే ఇరాన్ వెనక్కి తగ్గుతుందనే భావన. మూడవది?చమురు ధరలు మరియు గ్లోబల్ మార్కెట్లపై ప్రభావాన్ని తక్కువగా అంచనా వేయడం. ప్రస్తుత పరిస్థితి చూస్తే, ఇది పరిమిత యుద్ధం నుండి విస్తృత ప్రాంతీయ ఘర్షణగా మారే ప్రమాదం కనిపిస్తోంది. హోర్ముజ్ జలసంధి సమస్య పరిష్కారం కాకపోతే, చమురు సరఫరా మరింత క్షీణించి, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్రమైన ప్రభావం చూపే అవకాశముంది.అందువల్ల "అమెరికా ఇరాన్‌ను తక్కువ అంచనా వేసిందా?" అనే ప్రశ్నకు సమాధానం?అవును, వ్యూహాత్మకంగా కొన్ని కీలక అంశాల్లో తక్కువ అంచనా వేసింది అని చెప్పాలి. అయితే ఈ ఘర్షణ ఇంకా ముగియలేదు; తదుపరి పరిణామాలు అమెరికా వ్యూహం ఎంతవరకు మారుతుందో, ప్రపంచ శక్తి సమీకరణాలు ఎలా మారుతాయో నిర్ణయిస్తాయి.

## ఇంధన భయం వద్దు..41 దేశాల నుంచి ఇంధన దిగుమతులు

- మొదటి పేజి తరువాయి

సామాన్యులపై వీటి ప్రభావం ఉండకుండా చర్యలు తీసుకుంటున్నట్టు ప్రధాని చెప్పారు. దేశ అవసరాల్లో సుమారు 60 శాతం ఎల్పీజీ దిగుమతులపై ఆధారపడుతున్నప్పటికీ సరఫరా అనిశ్చిత పరిస్థితుల్లో దేశీయ వినియోగానికి ప్రాధాన్యం ఇస్తూ ఉత్పత్తిని పెంచుతున్నామని వెల్లడించారు.

**3.75 లక్షల మంది స్వదేశానికి రప్పించాం**

గల్ఫ్ దేశాల్లో ఉన్న భారతీయుల భద్రతకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తున్నామని స్పష్టం చేశారు. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి భారతీయులకు నిరంతర సహాయం అందిస్తూ ఇప్పటివరకు 3.75 లక్షల మందిని స్వదేశానికి రప్పించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో పలు దేశాధినేతలతో కూడా చర్చలు జరిపినట్లు, భారతీయుల భద్రతపై వారు హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. గత మూడు వారాలుగా కొనసాగుతున్న ఈ ఘర్షణ ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో పాటు ప్రజల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతోందని, అందుకే త్వరిత పరిష్కారం కోసం ప్రపంచ దేశాలు పిలుపునిస్తున్నాయని ప్రధాని పేర్కొన్నారు.

**53 లక్షల మెట్రిక్ టన్నుల వ్యూహాత్మక నిల్వలు**

ఇంధనం భారత ఆర్థిక వ్యవస్థకు కీలకమని, పశ్చిమాసియా దేశాలు ప్రధాన వనరుగా కొనసాగుతున్నాయని తెలిపారు. సరఫరా నిరంతరత కోసం పలు దేశాలతో నిరంతర సంప్రదింపులు కొనసాగుతున్నాయని చెప్పారు. హర్మూజ్ జలసంధి మార్గంలో చిక్కు కున్న భారత నౌకలు సురక్షితంగా తిరిగి చేరాయని వెల్లడించారు. దేశానికి 53 లక్షల మెట్రిక్ టన్నుల వ్యూహాత్మక చమురు నిల్వలు సిద్ధంగా ఉన్నాయని, 41 దేశాల నుంచి ఇంధన దిగుమతులు జరుపుతున్నామని తెలిపారు.

**ప్రపంచంపై యుద్ధ ప్రభావం**

గత మూడు వారాలుగా కొనసాగుతున్న ఈ ఘర్షణ ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో పాటు ప్రజల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతోందని ప్రధాని తెలిపారు. ఈ పరిస్థితుల్లో త్వరిత పరిష్కారం కోసం ప్రపంచ దేశాలు పిలుపునిస్తున్నాయని పేర్కొన్నారు.

## రోజుకు 1.5జీబీ డేటా వాడుకోమని ఇచ్చి.. డేటా మిగిలితే మిడ్ నైట్‌కు మాయం చేయడం ఏంటి ?

- మొదటి పేజి తరువాయి

అవుతుందని.. అయితే మిగిలిపోయిన డేటా మిడ్ నైట్‌కు ఎక్స్‌పైరీ అయిపోతుందని ఆయన వివరించారు. ఆ మిగిలిపోయిన డేటాకు ఎలాంటి రిఫండ్ ఉండదని చెప్పారు.

ఇదేదో పొరపాటున జరుగుతుంది కాదని.. ఇది టెలికాం కంపెనీల పాలసీ అని తెలిపారు. అవసరం ఉన్నా లేకపోయినా వాడుకోవాలని లేకపోతే మిడ్ నైట్?కు వ్యాలిడిటీ అయిపోతుందని.. ప్రస్తుతం ఇండియాలో మొబైల్ డేటాను టెలికాం కంపెనీలు ఇలా అందిస్తున్నాయని చెప్పారు. మిగిలిపోయిన.. వాడుకోని డేటాకు డబ్బులెందుకు కట్టాలని.. వాడుకోని డేటాను ట్రాన్స్?ఫర్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలా జరిగితేనే.. రీఛార్జ్ చేసుకున్న కస్టమర్లకు న్యాయం జరుగుతుందని.. వాళ్లు కడుతున్న డబ్బుకు విలువ ఉంటుందని ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా రాజ్యసభలో వాదించారు. ఈ అంశంపై ఆయన వాదనతో నెటిజన్లు ఏకపక్షంగా ఏకీభవించారు. ఉదాహరణలతో సహా ఆయన వాదనను బలపరిచారు. ఒక కిరాణా షాపుకు వెళ్లి ఒక కిలో పంచదార కొన్నామనుకుందాం. ఆ కిలో పంచదారలో 800 గ్రాములు మాత్రమే వాడుకున్నాం. ఇంకా నా దగ్గర మిగిలిపోయిన 200 గ్రాముల పంచదారను అర్ధరాత్రి వచ్చి కిరాణా షాపు యజమాని తిరిగి తీసుకుపోడని.. టెలికాం కంపెనీల తీరు మాత్రం ఇందుకు భిన్నంగా ఉందని నెటిజన్లు చెప్పారు. టెలికాం కంపెనీల డైలీ డేటా లిమిట్?పై వినియోగదారుల నుంచి గతంలోనూ తీవ్ర అభ్యంతరాలు వచ్చాయి. అయినప్పటికీ టెలికాం కంపెనీలు డైలీ డేటా వినియోగంపై 24 గంటల వ్యాలిడిటీ మాత్రమే ఇచ్చాయి. రోజుకు ఇంత అని ఆఫర్ చేసిన డేటాను వినియోగదారుడు వాడుకోకపోతే అది అతని సమస్య అని, తమకు ఏం సంబంధం ఉందని.. ఎందుకు ఆ డేటాను యాడ్ చేయాలనే రీతిలో టెలికాం కంపెనీలు వ్యవహరిస్తున్నాయి.

## 20 నెలల్లోనే ఆర్సెలర్ మిట్టల్ ను తీసుకొచ్చాం... ఇదీ మా స్పీడు

- మొదటి పేజి తరువాయి

నాలుగు లైన్ల రహదారి నిర్మాణం కూడా చేపట్టనున్నట్లు వెల్లడించారు. 2028 నాటికి ప్లాంట్‌లో మొదటి దశ ఉత్పత్తి ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, 2030 జూన్ నాటికి మొదటి బ్లాస్ట్ ఫర్నేస్, అదే ఏడాది డిసెంబరు నాటికి రెండో బ్లాస్ట్ ఫర్నేస్ నిర్మాణం పూర్తి చేస్తారని కార్యాచరణను వివరించారు. ఈ ప్రాజెక్టుతో ఉక్కు ఉత్పత్తి మాత్రమే కాకుండా విద్య, వైద్యం, ఉద్యోగాలతో ఈ ప్రాంత రూపురేఖలే మారిపోతాయని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.

**20 నెలల్లోనే సాధించాం**

దేశంలోనే అత్యంత వేగంగా భూసేకరణ, అనుమతులు ఇచ్చి ఈ ప్రాజెక్టును పట్టాలెక్కించిన ఘనత ఆంధ్రప్రదేశ్‌కే దక్కుతుందని చంద్రబాబు అన్నారు. పారిశ్రామిక అనుకూల ప్రభుత్వం, నైపుణ్యం కలిగిన మానవ వనరులు ఏపీ సొంతమని చెప్పారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 20 నెలల్లోనే రాష్ట్రానికి రూ.20.35 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించగలిగామని తెలిపారు. ఈ ప్రాజెక్టు సాకారంలో కీలక పాత్ర పోషించిన ఆదిత్య మిట్టల్, మంత్రి నారా లోకేష్‌ను ఆయన అభినందించారు. పరిశ్రమ ఏర్పాటుకు భూములను త్యాగం చేసిన రైతులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**విశాఖ కేంద్రంగా ఆర్థిక ప్రగతి**

ఈ ప్రాజెక్టుతో విశాఖ ఎకనామిక్ రీజియన్.. నాలెడ్జ్ ఎకానమీ, పోర్టులు, స్టీల్, డేటా సెంటర్లు, ఐటీకి కీలక కేంద్రంగా మారుతుందని సీఎం పేర్కొన్నారు. ఇప్పటికే విశాఖలో గూగుల్ డేటా సెంటర్ రాబోతోందని, దీని ద్వారా 15 బిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి రావడం దేశంలో ఇదే తొలిసారని గుర్తుచేశారు. టీసీఎస్, కాగ్నిజెంట్, రిలయన్స్, బీపీసీఎల్ వంటి దిగ్గజ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నాయని తెలిపారు. ఉత్తరాంధ్ర రేర్ ఎర్త్ మినరల్ హబ్‌గా మారుతుందని, పరిశ్రమలకు అవసరమైన నీటిని పోలవరం ద్వారా అందిస్తామని హామీ ఇచ్చారు. కొత్తగా మూలపేట పోర్టు, జూలైలో ప్రారంభం కానున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వంటివి ఉత్తరాంధ్ర అభివృద్ధిని పరుగులు పెట్టిస్తాయని అన్నారు.

**స్థానిక యువతకే తొలి ప్రాధాన్యం**

ఆర్సెలర్ మిట్టల్ పరిశ్రమను ప్రభుత్వ ప్రాజెక్టుగా భావించి, నిర్మాణ పనులు వేగంగా పూర్తయ్యేందుకు పూర్తి సహకారం అందిస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. భూములు త్యాగం చేసిన రైతులకు అండగా నిలవాలని కంపెనీ యాజమాన్యాన్ని కోరారు. ముఖ్యంగా, ఈ పరిశ్రమలో తొలి ప్రాధాన్యంగా అనకాపల్లి జిల్లా యువతకు ఉద్యోగాలు కల్పించాలని ఆయన సూచించారు. స్థానిక యువతలో నైపుణ్యాభివృద్ధి కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేస్తున్నందుకు కంపెనీకి ధన్యవాదాలు తెలిపారు. 'వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్‌ప్రెన్యూర్' నినాదాన్ని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా విజయవంతం చేస్తామని పునరుద్ఘాటించారు.

## నారా లోకేశ్ తండ్రికి తగ్గ తనయుడు అనిపించుకున్నారు

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగంలో ఒక చారిత్రాత్మక ఘట్టానికి తెరలేచింది. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం వద్ద ప్రపంచ ప్రఖ్యాత ఉక్కు దిగ్గజం ఆర్సెలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ (ఏఎంఎన్ఎస్) ఏర్పాటు చేయనున్న భారీ సమీకృత ఉక్కు కర్మాగారానికి సోమవారం ఘనంగా శంకుస్థాపన జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. సుమారు రూ.1.35 లక్షల కోట్ల భారీ పెట్టుబడితో, దేశంలోనే అతిపెద్ద గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టుగా ఇది రూపుదిద్దుకోనుంది. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఆర్సెలర్ మిట్టల్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ లక్ష్మీ నివాస్ మిట్టల్, ఏఎంఎన్ఎస్ ఇండియా ఛైర్మన్ ఆదిత్య మిట్టల్, పలువురు రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

**చంద్రబాబు పాలన అద్వితీయం**

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి ప్రసంగిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపై ప్రశంసల వర్షం కురిపించారు. "ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుచూపు, అపారమైన పరిపాలనా అనుభవం, పారిశ్రామిక అభివృద్ధి పట్ల ఆయనకున్న నిబద్ధత వల్లే ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అత్యంత ప్రగతిశీల, పెట్టుబడులకు అనువైన రాష్ట్రంగా నిలిచింది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో కలిసి వారి నాయకత్వం అద్వితీయంగా రాణిస్తోంది. తండ్రికి తగ్గ తనయుడిగా నారా లోకేశ్ కూడా నిరూపించుకుంటున్నారు.ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చడంలో లోకేశ్ కీలక పాత్ర పోషించారు" అని అన్నారు. ఈ భారీ ప్రాజెక్టు కోసం అనకాపల్లిని ఎంచుకోవడం రాష్ట్ర ప్రభుత్వ వ్యూహాత్మక దార్శనికతకు నిదర్శనమని కొనియాడారు.

**దేశ ప్రగతిలో భాగస్వామ్యం**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో భారత్ పారిశ్రామిక పునరుజ్జీవనంలో కొత్త శకంలోకి ప్రవేశించిందని కుమారస్వామి పేర్కొన్నారు. "ప్రధాని మోదీ రూపకల్పన చేసిన 'వికసిత్ భారత్ 2047', 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యాల్లో భాగంగా దేశీయ ఉత్పాదన గణనీయంగా పెరగాలి. జాతీయ ఉక్కు వినియోగ విధానాన్ని అనుసరించి దేశవ్యాప్తంగా ఉక్కు ఉత్పాదనను పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఆర్సెలార్ మిట్టల్–నిప్పన్ స్టీల్ పరిశ్రమ ఏపీకి రావడంతో ఈ ప్రాంతంలో స్టీల్ ఎకోసిస్టమ్ సాకారమైంది" అని వివరించారు. ఈ ప్రాజెక్టు ఉక్కు ఉత్పాదనకు, ఎంఎస్ఎంఈలకు, ఉద్యోగ కల్పనకు ఒక చోదక శక్తిగా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

**విశాఖ ఉక్కుపై స్పష్టమైన హామీ**

ఇదే వేదికపై నుంచి విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ (=×చీూ) పునరుద్ధరణపై కేంద్ర మంత్రి కుమారస్వామి స్పష్టమైన హామీ ఇచ్చారు. "వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను స్థిరీకరించి, గాడిలో పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.11,440 కోట్లకు పైగా ఆర్థిక సహాయాన్ని అందించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి ఆర్ఐఎన్ఎల్‌ను బలోపేతం చేయడానికి, ఉక్కు రంగంలో దాని పూర్వ వైభవాన్ని తీసుకురావడానికి కేంద్రం కట్టుబడి ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమష్టి కృషితో ఆ సంస్థను తిరిగి వృద్ధి పథంలో నిలుపుతాం" అని ఆయన స్పష్టం చేశారు.

**లక్ష మందికి ఉపాధి.. ప్రాంతీయ అభివృద్ధి**

ఈ ప్రాజెక్టును 5,400 ఎకరాల విస్తీర్ణంలో రెండు దశల్లో అభివృద్ధి చేయనున్నారు. పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే 17.8 మిలియన్ టన్నుల వార్షిక ఉత్పాదక సామర్థ్యంతో పనిచేస్తుంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు లక్ష మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా. ఈ ప్రాజెక్టుకు అనుబంధంగా రూ.11,000 కోట్లకు పైగా పెట్టుబడితో 50 మిలియన్ టన్నుల సామర్థ్యంతో క్యాప్టివ్ పోర్టును కూడా నిర్మించనున్నారు. ఇది మరో 6,000 మందికి ఉపాధి కల్పిస్తుంది. ఈ ప్లాంట్ స్థానిక యువతకు ఉపాధి కల్పించడమే కాకుండా, అనుబంధ పరిశ్రమలు, ఎంఎస్ఎంఈలను బలోపేతం చేసి ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తుందని కుమారస్వామి విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రాజెక్టును వేగంగా పూర్తి చేసి ఉత్పాదన ప్రారంభించాలని ఆకాంక్షిస్తూ తన ప్రసంగాన్ని ముగించారు.

## 'రీల్' లైఫ్‌లోనైనా సీఎం అవుతా.. రేవంత్ రెడ్డిని నేనే ముఖ్యమంత్రిని చేశా

మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఎక్కడ ఉంటే అక్కడ సందడి ఖాయం. తాజాగా తెలంగాణ అసెంబ్లీ లాబీల్లో మీడియా ప్రతినిధులతో ముచ్చటించిన మల్లన్న, తన మనసులోని అసలు కోరికను బయటపెట్టారు. రాజకీయంలో సీఎం ఎలాగూ కాలేను, కనీసం వెండితెరపై అయినా ముఖ్యమంత్రి పాత్ర పోషించాలని తనకు బలంగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు. సినిమాల్లో సీఎం రోల్ వస్తే చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని, అలా అయినా తన కోరికను తీర్చుకుంటానని నవ్వుతూ చెప్పారు. "రెడ్డి సామాజిక వర్గంలో రేవంత్ రెడ్డి తప్ప మరో పవర్‌ఫుల్ లీడర్ లేరని గతంలోనే చెప్పాను. ఒక రకంగా ఆయన్ను సీఎం చేసింది నేనే" అంటూ తనదైన శైలిలో చమత్కరించారు. రాజకీయాలు ఎలా ఉన్నా, తాను రేవంత్ రెడ్డి అన్నదమ్ములమేనని ఆయన స్పష్టం చేశారు.సినిమాలపై తనకున్న మక్కువను వివరిస్తూ.. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంలో తనకు విలన్ పాత్ర ఆఫర్ వచ్చిందని మల్లారెడ్డి వెల్లడించారు. దర్శకుడు హరీశ్ శంకర్ స్వయంగా అడిగినప్పటికీ, విలన్ వేషం వేయడం ఇష్టం లేక తాను సున్నితంగా తిరస్కరించానని చెప్పారు. విలన్ కంటే తనకు సీఎం లాంటి పవర్‌ఫుల్ పాత్రల పైనే ఆసక్తి ఉందని ఆయన హింట్ ఇచ్చారు.

## ఏపీలో అతిపెద్ద స్టీల్ ప్లాంట్... శంకుస్థాపన చేసిన సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి కుమారస్వామి

- మొదటి పేజి తరువాయి

టన్నుల ఉక్కును ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. నిర్మాణ పనులు పూర్తి చేసి 2029 నుంచి ఉత్పత్తిని ప్రారంభించాలని కంపెనీ ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ భారీ ప్రాజెక్టు రాష్ట్ర పారిశ్రామిక ముఖచిత్రాన్ని మార్చగలదని అంచనా వేస్తున్నారు. దీనిద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

## పోలీసుల తీరుపై అంబటి ధ్వజం.. అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళతానని హెచ్చరిక

- మొదటి పేజి తరువాయి

తన ఆస్తులపై విధ్వంసం సృష్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పోలీసు యంత్రాంగంపై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

తన ఇంటిపై దాడి చేసిన వారికి కేవలం ఏడేళ్ల లోపు శిక్ష పడే సెక్షన్లతో స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపారని, కానీ అదే సెక్షన్లతో తనను మాత్రం 18 రోజుల పాటు జైలుకు పంపడం అన్యాయమని అంబటి మండిపడ్డారు. నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో తనపై కస్టోడియల్ టార్చర్ జరిగిందని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఆ స్టేషన్ లోని సీసీటీవీ ఫుటేజీని తక్షణమే స్వాధీనం చేసుకోవాలని కోరారు.టీడీపీ నేతలు దాడి చేస్తున్నప్పుడు పోలీసులు వారికి పూర్తిగా సహకరించారని, తాను ఫిర్యాదు చేసే వరకు కనీసం సుమోటోగా కూడా కేసు నమోదు చేయలేదని ఆరోపించారు. ముఖ్యంగా పట్టాభిపురం సీఐ వెంకటేశ్వర్లు ఈ కేసులో దారుణంగా వ్యవహరించారని అన్నారు. ఈ దాడుల వెనుక ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ హస్తం ఉందని నేరుగా ఆరోపించారు.ఈ కేసులో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని అంబటి స్పష్టం చేశారు. ఈ ఘటనపై విచారణకు సిట్ ఏర్పాటు చేయాలని, హత్యాయత్నం, ఆస్తి నష్టం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశామని, అక్కడ న్యాయం జరగకపోతే దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు మెట్లు ఎక్కేందుకైనా సిద్ధమని హెచ్చరించారు.

## వాలంటీర్ల సాయంతో భూ కబ్జాకు యత్నించారంటూ వైసీపీ నేతలపై గ్రీవెన్స్ లో ఫిర్యాదు

- మొదటి పేజి తరువాయి

కొందరు అధికారులు, వాలంటీర్ల సాయంతో తమ భూములను కబ్జా చేశారని, రికార్డులను తారుమారు చేసి తమను రోడ్డున పడేశారని పలువురు బాధితులు కన్నీటిపర్యంతమయ్యారు. మాజీ మంత్రి, ఏపీ ఉమెన్స్ కో–ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పీతల సుజాత, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఛైర్మన్ ఎస్. రాజశేఖర్ బాధితుల నుంచి అర్జీలు స్వీకరించి, వారికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

**వాలంటీర్లతో కలిసి భూమిని బ్లాక్ లిస్ట్‌లో పెట్టించారు**

అనంతపురం జిల్లా గుత్తి మండలం కొజ్జేపల్లి గ్రామానికి చెందిన పెద్ద శ్రీనివాసులు తన గోడును వెళ్లబోసుకున్నారు. మార్నెపాలెం గ్రామంలో సర్వే నెం. 4–3లో తనకు వారసత్వంగా సంక్రమించిన 7.44 ఎకరాల భూమి ఉందని తెలిపారు. గత ప్రభుత్వంలో వైసీపీకి చెందిన కొందరు స్థానిక నేతలు వాలంటీర్లతో కలిసి తన భూమిని అక్రమంగా బ్లాక్ లిస్ట్‌లో పెట్టించారని ఆరోపించారు. తన భూమిని వేరే సర్వే నంబర్‌లోకి మార్చి, తప్పుడు రికార్డులు సృష్టించారని, దీనిపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుని, తన భూమిని తనకు ఇప్పించాలని ఆయన నేతలను కోరారు.

**పీర్ల చావిడి మాన్యం భూమి కబ్జా**

నంద్యాల జిల్లా బనగానపల్లె మండలం కానాల గ్రామానికి చెందిన అబ్దుల్ మజీద్, తమ గ్రామంలోని పీర్ల చావిడికి చెందిన 4.40 ఎకరాల మాన్యం భూమిని ఓ వ్యక్తి కబ్జా చేశాడని ఫిర్యాదు చేశారు. పూర్వం నుంచి తమ పూర్వీకులు ఈ భూమిని సాగు చేస్తూ వచ్చే ఆదాయంతో పీర్ల చావిడి పండుగ నిర్వహించేవారని, కానీ ఇప్పుడు భూమి కబ్జాకు గురికావడంతో సొంత ఖర్చులతో, భక్తుల చందాలతో పండుగ నిర్వహించడం భారంగా మారిందని వాపోయారు.

**9 సెంట్ల స్థలం కోసం దాడి.. కాళ్లు విరగ్గొట్టారు**

కృష్ణా జిల్లా చల్లపల్లి మండలం రామానగరం గ్రామానికి చెందిన దాసు రామకృష్ణ, తనపై జరిగిన దాడిని వివరిస్తూ కన్నీటిపర్యంతమయ్యారు. తనకు చెందిన 9 సెంట్ల స్థలాన్ని ఆక్రమించుకునే ఉద్దేశంతో కొందరు వ్యక్తులు తనపై దాడి చేసి రెండు కాళ్లూ విరగ్గొట్టారని, మైనర్ బాలురతో తల పగలగొట్టించారని తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు, రెవెన్యూ అధికారులు నిందితులకే వత్తాసు పలుకుతున్నారని, తనకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

**రికార్డుల తారుమారుతో అంతులేని వేధింపులు**

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అనేకమంది బాధితులు భూ రికార్డుల తారుమారు, అధికారుల నిర్లక్ష్యంపై ఫిర్యాదులు చేశారు.

అన్నమయ్య జిల్లా: భూమిని అమ్మాక, రీ–సర్వేలోని తప్పులను ఆసరాగా చేసుకుని కొనుగోలుదారు తనపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నాడని శ్రీనివాసులు అనే బాధితుడు తెలిపారు.

నెల్లూరు జిల్లా: తన భూమికి కొలతలు వేసి హద్దులు చూపాలని ఏళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని కృష్ణారెడ్డి అనే రైతు వాపోయారు.

ఎన్టీఆర్ జిల్లా: తమ పూర్వీకుల స్థలంలోకి కొందరు వ్యక్తులు చొరబడి ఆక్రమణలకు పాల్పడుతున్నా పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేశారు.

ఏలూరు జిల్లా: పేదలకు కేటాయించిన అసైన్డ్ భూమిని రెవెన్యూ అధికారులు అక్రమంగా ఓ సంపన్న వ్యక్తి పేరు మీద మ్యుటేషన్ చేశారని, సమాచార హక్కు చట్టం కింద వివరాలు అడిగినా ఇవ్వడం లేదని భాస్కరరావు ఆరోపించారు.

కాకినాడ జిల్లా: 1988లో ప్రభుత్వం ఇచ్చిన డి–పట్టా భూమిని ఆన్‌లైన్ చేయకుండా అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని చిట్టియ్య తెలిపారు.

కృష్ణా జిల్లా: దస్తావేజుల ప్రకారం 1.24 ఎకరాలు ఉండాల్సిన భూమి, ఆన్‌లైన్ రికార్డుల్లో 0.19 సెంట్లుగా నమోదవడంతో రైతు భరోసా వంటి పథకాలు అందడం లేదని చిట్టిబాబు వాపోయారు.

తిరుపతి జిల్లా: ప్రభుత్వం ఇచ్చిన పట్టా భూమిని సాగు చేసుకుంటుంటే, ఎటువంటి నోటీసు లేకుండా పట్టా రద్దు చేస్తానని తహసీల్దార్ బెదిరిస్తున్నారని ఎల్లమ్మ అనే మహిళ ఆవేదన వ్యక్తం చేశారు.

పల్నాడు జిల్లా: తన ఖాళీ స్థలానికి వెళ్లే దారిని మూసివేసి, గోడ కట్టి, చంపుతామని బెదిరిస్తున్నారని రామారావు అనే వృద్ధుడు ఫిర్యాదు చేశారు.

వీరితో పాటు పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల నిర్మాణం, ఉద్యోగ అవకాశాలు, ఆరోగ్య సమస్యలకు ఆర్థిక సాయం వంటి పలు సమస్యలపై కూడా ప్రజలు నేతలకు వినతిపత్రాలు సమర్పించారు.

## ఇరాన్‌తో యుద్ధాన్ని తాత్కాలికంగా ఆపేస్తున్నాం

- మొదటి పేజి తరువాయి

దాడులు ఆపేస్తున్నట్లు చెప్పారు. రెండు రోజులుగా ఇరాన్‌తో జరిగిన చర్చలు సానుకూలంగా సాగాయని పేర్కొన్నారు."గత రెండు రోజులుగా అమెరికా, ఇరాన్ మధ్య చర్చలు సానుకూలంగా జరిగాయని చెప్పడానికి నేను సంతోషిస్తున్నాను. ఇరుదేశాల మధ్య జరిగిన చర్చల నేపథ్యంలో ఇరాన్ విద్యుత్ కేంద్రాలు, ఇంధన మౌలిక సదుపాయాలపై అన్ని రకాల సైనిక దాడులను ఐదు రోజుల పాటు వాయిదా వేయాలని ఆదేశించాను" అని ఆయన సోషల్ మీడియా వేదికగా ప్రకటన చేశారు.పశ్చిమాసియాలో తాము శాంతికోసం కృషి చేస్తామని ట్రంప్ తెలిపారు. మరోవారం రోజుల పాటు చర్చలు జరిగే అవకాశం ఉందని అన్నారు. చర్చల ఫలితంపై ఆధారపడి భవిష్యత్తు కార్యాచరణ ఉంటుందని స్పష్టం చేశారు.

## చంద్రబాబు విధానాలు భరోసానిచ్చాయి...

- మొదటి పేజి తరువాయి

ఈ పరిశ్రమ అనకాపల్లి ప్రాంతానికి గ్రోత్ ఇంజన్‌గా మారుతుందని, ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి కల్పిస్తుందని ప్రకటించారు. తాను జన్మించిన భారతదేశంలో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో స్టీల్ ప్లాంట్ నిర్మించడం గర్వంగా ఉందని మిట్టల్ తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆవిష్కరించిన 'ఆత్మనిర్భర్ భారత్', 'వికసిత్ భారత్' లక్ష్యాల సాధనలో ఇది ఆరంభం మాత్రమేనని ఆయన అభివర్ణించారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌కు అనుగుణంగా ఈ ప్లాంట్ రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పారిశ్రామికవేత్తలలో విశ్వాసం నింపేలా ఏపీ ప్రభుత్వ విధానాలు ఉన్నాయని ప్రశంసించారు. దేశ అవసరాలకు అనుగుణంగా ఈ ప్లాంట్‌ను నిర్మిస్తున్నామని వివరించారు. మౌలిక సదుపాయాలు, రక్షణ రంగ ఉత్పత్తులు సహా అనేక రంగాలకు అవసరమైన స్టీల్ ఉత్పత్తులను ఇక్కడ తయారు చేస్తామని చెప్పారు. 50 ఏళ్ల క్రితం తాము తొలి స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేశామని, ఇప్పుడు అనకాపల్లిలో నిర్మించేది అత్యంత ఆధునిక ప్లాంట్‌గా నిలిచిపోతుందని మిట్టల్ పేర్కొన్నారు. ఈ భారీ పరిశ్రమ ఏర్పాటుకు సహకరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
కృష్ణా జిల్లా । ఎన్.టి.ఆర్. జిల్లా । గుంటూరు జిల్లా । పల్నాడు జిల్లా । బాపట్ల జిల్లా

# విభిన్న ప్రతిభావంతుల (అంధుల) క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి...





పెన్ పవర్, గుంటూరు, మార్చి, 23. గుంటూరు నగరంలోని 52వ డివిజన్ అరండల్‌పేట పిచ్చుకలగుంట వద్ద నిర్వహించిన విభిన్న ప్రతిభావంతుల (అంధుల) క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ముఖ్య అతిథిగా హాజరయ్యి ప్రారంభించారు. అరండల్ పేట 52వ డివిజన్‌లోని పిచ్చుకలగుంట గ్రౌండ్‌లో అంధుల క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం ఎంతో ఆనందకరమని, ఆంధ్రప్రదేశ్ అంధుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇలాంటి గొప్ప క్రీడా కార్యక్రమాన్ని ప్రోత్సహించడం సమాజానికి స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. ఇది ఇంటర్ స్టేట్ టోర్నమెంట్‌గా నిర్వహించబడుతుండగా, ఆంధ్రప్రదేశ్ జట్టు మరియు మధ్యప్రదేశ్ జట్టు పాల్గొనడం విశేషమన్నారు. అంధుల క్రికెట్ ఎలా ఆడతారో ప్రత్యక్షంగా చూడాలనే ఉత్సాహంతో తాను ఈ కార్యక్రమానికి వచ్చినట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. భారతదేశం అంధుల క్రికెట్‌లో వరల్డ్ కప్ సాధించడం గర్వకారణమని, అర్జున అవార్డు గ్రహీత అజయ్ వంటి క్రీడాకారులు దేశానికి గౌరవం తీసుకువచ్చారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి గుర్తుచేశారు.

అలాగే పారా ఒలింపిక్స్ వంటి వేదికలలో విభిన్న ప్రతిభావంతులు అద్భుత ప్రతిభను ప్రదర్శిస్తూ దేశానికి గర్వకారణంగా నిలుస్తున్నారని, ఇలాంటి క్రీడలు మరింత ప్రోత్సాహం పొందాలని, సమాజంలో ప్రతి ఒక్కరూ విభిన్న ప్రతిభావంతులను కలుపుకొని ముందుకు సాగితే సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. ఈ తరహా టోర్నమెంట్లు మరిన్ని నిర్వహించేందుకు పెద్దలు, సంస్థలు సహకరించాలని, ఈ టోర్నమెంట్‌లో పాల్గొనడం తానే గొప్ప విజయమని, గెలుపు-ఓటమి కంటే ధైర్యం, పట్టుదల ముఖ్యమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు....

# సజావుగా పదో తరగతి పరీక్షలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ డా. జి.లక్ష్మీశ...



పెన్ పవర్, విజయవాడ, మార్చి, 23. జిల్లాలో పదో తరగతి పరీక్షలు సజావుగా జరుగుతున్నాయి. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమన్వయ శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సోమవారం నగరంలోని బోయపాటి శివరామకృష్ణయ్య మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్, కర్నాటి రాంమోహనరావు మునిసిపల్ హైస్కూల్ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. వేసవి నేపథ్యంలో చేసిన తాగునీటి ఏర్పాట్లు, నిరంతర విద్యుత్ సరఫరా, ఫ్యాన్లు, వైద్య శిబిరం వంటి సౌకర్యాలను పరిశీలించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోపాలు ఉండకూడదని అధికారులు, సిబ్బందికి స్పష్టం చేశారు. మొత్తం 27,360 మంది విద్యార్థులకు 149 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేసి ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా చూస్తున్నట్లు తెలిపారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా విద్యార్థులు సజావుగా పరీక్షలు రాసేందుకు సౌకర్యాలు కల్పించామన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా పటిష్ట బందోబస్తును కూడా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు హాల్ టికెట్ చూపించి ఆర్‌టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం పొందేలా చూస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి పరీక్షలను అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి పరీక్షా కేంద్రంలో అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించామని కలెక్టర్ లక్ష్మీశ చెప్పారు...

# పారిశుధ్య పనుల్లో లోపాలు సహించేది లేదు... కమిషనర్ కె.మయూర్ అశోక్..





పెన్ పవర్, గుంటూరు, మార్చి, 23. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావులేదని, ఎక్కడైనా సిబ్బంది, అధికారులు, సచివాలయ సెక్రెటరీలు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు గుర్తిస్తే కఠిన చర్యలు తప్పవని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ స్పష్టం చేశారు. సోమవారం ఓల్డ్ క్లబ్ రోడ్, బస్టాండ్ మెయిన్ రోడ్, నెహ్రూ నగర్ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి క్షేత్రస్థాయిలో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించిన అనంతరం అధికారులతో మాట్లాడుతూ ప్రధాన కాల్వల్లో పూడికతీత పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో డ్రైన్లపై ఆక్రమణలను తొలగించాలన్నారు. డ్రైన్లు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోతున్నాయని, కమర్షియల్ సంస్థలు డ్రైన్లలో వ్యర్థాలు వేస్తే భారీ మొత్తంలో అపరాధ రుసుం విధించాలని ఆదేశించారు. ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు సమన్వయంతో డ్రైన్లలో మెష్ లు ఏర్పాటు చేయాలన్నారు. మధ్యాహ్నం సమయంలో చేపట్టే గ్యాంగ్ వర్క్ పనులు మరింత సమర్థవంతంగా జరగాలని, విధుల్లో పారిశుధ్య కార్మికుల హాజరు నూరు శాతం ఉండేలా పర్యవేక్షించాలని సూచించారు. డ్రైన్ల క్లీనింగ్ పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేయడంతో పాటు, ఇంటింటి చెత్త సేకరణ ప్రక్రియ నూరు శాతం పక్కాగా జరిగేలా చూడాలన్నారు. పారిశుధ్య మెరుగుదలలో భాగంగా నగరంలో అవసరమైన ప్రాంతాలను గుర్తించి తక్షణమే క్లస్టర్ కంపోస్ట్ బిన్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే, నగరంలోని ఖాళీ స్థలాలను గుర్తించి వెంటనే వాటిలో జీఎంసీ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని, నోటీసులు ఇచ్చినా స్పందించని ఖాళీ స్థలాల యజమానులపై తక్షణమే అపరాధ రుసుం (పెనాల్టీ) విధించాలని ప్రజారోగ్య అధికారులకు స్పష్టం చేశారు. వ్యాపార సంస్థలు తప్పనిసరిగా కమర్షియల్ ఏజన్సీకే ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. గార్బేజ్ వల్నరబుల్ పాయింట్స్ ఉండడానికి వీలు లేదని, ఎస్ఎస్ లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పర్యటనలో ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు...

# ప్రతి అర్జీకీ నాణ్యమైన పరిష్కారం చూపాలి...జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ...



పెన్ పవర్, విజయవాడ, మార్చి, 23. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చే ప్రతి అర్జీపైనా ప్రత్యేకంగా దృష్టిసారించాలని.. అర్జీదారులు సంతృప్తి చెందేలా నిర్దిష్ట గడువులోగా సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. సోమవారం కలెక్టర్ లక్ష్మీశ.. జేసీ ఇలక్కియ, అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 112 అర్జీలు వచ్చాయి. వీటిలో రెవెన్యూకు 31, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు 24, పోలీసు శాఖకు 14, పంచాయతీరాజ్‌కు 9 అర్జీలు వచ్చాయి. విద్యుత్ 4, ఆరోగ్యం 4, విభిన్న ప్రతిభావంతుల శాఖ 3, ఇరిగేషన్‌కు 3 అర్జీలు వచ్చాయి. ఇదేవిధంగా డీఆర్‌డీఏ, విద్య, దేవాదాయ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖలకు రెండు చొప్పున అర్జీలు వచ్చాయి. వ్యవసాయం, పశుసంవర్ధక, జెడ్‌పీ సీఈవో, పౌరసరఫరాలు, సహకార, అడవులు, గృహనిర్మాణం, కార్మికశాఖ, మార్క్‌ఫెడ్, మార్కెటింగ్, రహదారులు-భవనాలు, గ్రామీణ నీటి సరఫరాకు ఒక్కో అర్జీ వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం పీజీఆర్ఎస్ కు అత్యంత ప్రాధాన్యమిస్తోందని.. ఈ కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు సత్వరం పరిష్కారం కావాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి అధికారులతో నిరంతర సమన్వయంతో అర్జీల పరిష్కారానికి కృషిచేయాలన్నారు. సమస్యల పరిష్కారంలో పారదర్శకత, బాధ్యతాయుత విధానం పాటించాలని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసిహం, పీజీఆర్ఎస్ కోఆర్డినేటర్ జ్యోతి, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు....

# ముందస్తు జాగ్రత్తలే వడదెబ్బ నుంచి రక్షణ...జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ...



పెన్ పవర్, విజయవాడ, మార్చి, 23. వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా వడదెబ్బ (హీట్ స్ట్రోక్) బారిన పడకుండా ప్రజలు తప్పనిసరిగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సూచించారు. ఈ జాగ్రత్తలే మనకు వడదెబ్బ నుంచి రక్షణగా నిలుస్తాయని పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో కలిసి వడదెబ్బ నివారణకు సంబంధించిన జాగ్రత్తలతో రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి ఉష్ణోగ్రతలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీలు, బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే కార్మికులు వడదెబ్బకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. మధ్యాహ్నం వేళల్లో అవసరమైతే తప్ప బయటకు వెళ్లకుండా ఉండాలని, బయటకు వెళ్లినప్పుడు తలపై రక్షణ కోసం టోపీ లేదా గొడుగు వంటివి ఉపయోగించాలని సూచించారు. అదేవిధంగా తగినంతగా నీరు, ఓఆర్ఎస్ ద్రావణం, కొబ్బరి నీరు వంటి ద్రవాలు తరచుగా తీసుకోవాలని.. వదులుగా ఉండే లేతరంగు కాటన్ దుస్తులు ధరించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ప్రజా ప్రదేశాల్లో ఈ పోస్టర్లను ప్రదర్శించి విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ఆదేశించారు. గ్రామ స్థాయిలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ఎం.సుహాసిని, డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం తదితరులు పాల్గొన్నారు....

# తిరుమల పవిత్రతను కాపాడటమే

## తెలుగుదేశం పార్టీ ధ్యేయం...రాచకొండ లక్ష్మయ్య...




పెన్ పవర్, గుంటూరు, మార్చి, 23. తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్గా ఎవరు ఉన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి లేదా ఇతర రాష్ట్రం ముఖ్యమంత్రి ప్రధాన మంత్రులు ఎవరు వచ్చినా చైర్మన్ పాలకవర్గ వారు వారికి ఆహ్వానం పలుకుతారు, ఈరోజుతిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు నూతన ఛైర్మన్ బి.ఆర్. నాయుడు పై గత పాలకుల అనుచరులు చేస్తున్న అసత్య ప్రచారాలను తెలుగుదేశం పార్టీ జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి లక్ష్మయ్య తీవ్రంగా ఖండిస్తూ తిరుమల తిరుపతి దేవస్థానం లో జరుగుతున్న ప్రక్షాళనను చూసి, గతంలో జరిగిన అవినీతి మరియు బంగారు ఆభరణాల మాయం వంటి అక్రమాలు ఎక్కడ బయటపడతా యోననే భయంతో మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ఇలాంటి దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారు. గతంలో తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్గా ఉన్న వైవి సుబ్బారెడ్డి అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తిరుమల తిరుపతి దేవస్థానం వచ్చినప్పుడు పాలకమండలి అందరూ దగ్గరుండి స్వాగతం పలకడం జరిగింది, కానీ ఈరోజు మాజీ చైర్మన్ కరుణాకర్ రెడ్డి దుర్మార్గంగా మాట్లాడుతున్నారు కరుణాకర్ రెడ్డి పై తక్షణమే చర్యలు తీసుకొని కఠినమైన చర్యలు తీసుకోవాలి. ఇలాంటి నీచుడు దుర్మార్గుడు ప్రజల్లో ఉండకూడదు, ఎటువంటి ఆధారాలు లేకుండా, వ్యక్తిగత దూషణలకు దిగడం మరియు ఫోటోలను మార్ఫింగ్ చేస్తూ సోషల్ మీడియాలో ప్రచారం చేయడం వారి నైతిక పతనాన్ని సూచిస్తోంది.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన సతీమణి నారా భువనేశ్వరి గారితో కలిసి శ్రీవారిని దర్శించుకున్నప్పుడు, తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ హోదాలో బి.ఆర్. నాయుడు వారికి స్వాగతం పలికి, సంప్రదాయబద్ధంగా సత్కరించడం అత్యున్నతమైన ప్రోటోకాల్‌లో భాగం. ముదు కోట్ల మంది హిందువుల ఆరాధ్య దైవం కొలువై ఉన్న తిరుమల తిరుపతి దేవస్థానం ను కించపరచడం అంటే, హిందూ ధర్మంపై దాడి చేయడమే లక్ష్మయ్య ఆవేదన వ్యక్తం చేశారు, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అండు కో మతాల మధ్య చిచ్చు పెట్టే విధంగా, పవిత్రమైన ధార్మిక సంస్థల ప్రతిష్టను దెబ్బతీసేలా ప్రవర్తిస్తున్న వారిపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లక్ష్మయ్య కోరుతున్నారు తిరుమల తిరుపతి దేవస్థానం పై అసత్యాలు ప్రచారం చేసే వారిని ప్రజలు గమనిస్తున్నారు, రాబోయే రోజుల్లో వారికి తగిన బుద్ధి చెబుతారు జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి లక్ష్మయ్య హెచ్చరించారు...

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలి: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం




చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 23 : ఎడ్లపాడు : మండలంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు రైతుల పంటను పూర్తిగా కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కమిటీ డిమాండ్ చేసింది. మండలంలోని వేలాది ఎకరాల్లో రైతులు మొక్కజొన్న పంటను సాగు చేసినట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. ఎక్కువ మంది రైతులు చిన్న, సన్నకారు రైతులే కావడంతో ప్రైవేట్ వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తీసుకుని పంటను సాగు చేయాల్సి వచ్చిందని వివరించారు. ఇతర పంటలు నష్టపోవడంతో మొక్కజొన్న సాగుపై రైతులు ఆధారపడినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం పంట చేతికి వస్తున్న తరుణంలో ప్రభుత్వం ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు ప్రైవేట్ దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల క్వింటాకు సుమారు రూ.700 వరకు నష్టం వాటిల్లుతోందని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.2400 ఉన్నప్పటికీ అమలు చేయడంలో ఆలస్యం జరుగుతోందని విమర్శించారు. అందువల్ల ప్రభుత్వం తక్షణమే స్పందించి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులను ఆదుకోవాలని కోరారు. లేకపోతే వ్యవసాయం రైతులకు మరింత భారంగా మారే పరిస్థితులు తలెత్తుతాయని హెచ్చరించారు.

# అకాల వర్షాలకు దెబ్బతిన్న రైతాంగాన్ని కాపాడాలి : ఎపి రైతు సంఘం

ఎన్‌టిఆర్ :పెన్ పవర్ ప్రతినిధి మార్చి 23:అకాల వర్షాలకు దెబ్బతిన్న రైతాంగాన్ని కాపాడాలని కోరుతూ .... సోమవారంజిల్లా కలెక్టర్ లక్ష్మీ షాను ఎపి రైతుసంఘంఎన్టీఆర్ జిల్లా ప్రధానకార్యదర్శిపివి.ఆంజనేయులు కలిసి విన్నవించారు.ఎన్టీఆర్ జిల్లా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా జిల్లా కలెక్టర్ లక్ష్మీషాని కలిసి రైతుల సమస్యలను ఎన్టీఆర్ జిల్లా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పగడాల.ఆంజనేయులు వివరించారు.

# ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్...





పెన్ పవర్, గుంటూరు, మార్చి, 23. పాఠశాలలో 136 మంది పిల్లలకుగాను కనీసం 30 మందికి కూడా సరిపోనంత భోజనం వండుతారా ? పిల్లల ఆకలి గురించి పట్టదా ? కొంచెమైనా మానవత్వం ఉందా ? వెంటనే ఇన్చార్జి ఎండీఎంను సస్పెండ్ చేయండి. రెండు రోజుల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూడండి. విద్యార్థులతో ఆటలాడితే సహించేది లేదు" అంటూ గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ అన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని మహాకవి తిక్కన ఎస్ పీకే హెచ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సోమవారం మధ్యాహ్నం ఎమ్మెల్యే నసీర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు ఎంత మంది హాజరయ్యానే అంశాలపై ఆరా తీశారు. అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును తెలుసుకునేందుకు వంట శాల వద్దకు వెళ్లారు. ఎంత మంది పిల్లలకు వంట చేస్తున్నారు ? ఎంత ఇండెంట్ తీసుకున్నారు ? ఇప్పటి వరకు ఎంత మందికి వంట పూర్తి చేశారు ? అంశాలపై ఎండీఎంను ప్రశ్నించారు. 136 మంది పిల్లలకు ఇండెంట్ తీసుకున్నట్లు ఎండీఎం చెప్పడంతో ఎమ్మెల్యే నసీర్ అవాక్కయ్యారు. అక్కడ కనీసం 30 మంది పిల్లలకు కూడా సరిపోని విధంగా ఆహారం తయారు చేయడంతో ఎమ్మెల్యే నసీర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేనా పిల్లలకు మీరు పెడుతున్న భోజనం అంటూ మండిపడ్డారు. వెంటనే మండల విద్యాశాఖాధికారిని పిలిపించి ఎండీఎంను సస్పెండ్ చేయాలని, పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై విచారణ చేపట్టాలని ఆదేశించారు. పాఠశాలలో ఉపాధ్యాయులు సమయపాలన సక్రమంగా లేదని, పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో విద్యా రంగం బలోపేతానికి ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకుంటున్నారని, క్షేత్రస్థాయిలో వ్యవస్థను నిర్వీర్యం చేస్తే సహించబోమని హెచ్చరించారు. నియోజకవర్గ వ్యాప్తంగా పాఠశాలలను తనిఖీ చేస్తానని, ఎలాంటి లోపాలు ఉన్నా ఉపేక్షింబోమని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా ఉపాధ్యాయులు, అధికారులు, పని చేయాల్సి ఉంటుందని చెప్పారు....

# ఫోటో జర్నలిస్టుల సేవలు ప్రశంసనీయం... కలెక్టర్ డా. జి. లక్ష్మీశ..



పెన్ పవర్, విజయవాడ, మార్చి, 23. సమాజంలోని వాస్తవ సంఘటనలను చిత్రాల రూపంలో ప్రతిబింబిస్తూ వార్తలకు జీవం పోసే ఫోటో జర్నలిస్టుల సేవలు ఎంతో ప్రశంసనీయమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఫోటో జర్నలిస్ట్ అసోసియేషన్ (ఏపీపీజేఏ) రూపొందించిన 2026 సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం కలెక్టరేట్‌లోని శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్‌లో కలెక్టర్ లక్ష్మీశ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఫోటో వెనుక ఒక యథార్థ కథ దాగి ఉంటుందని తెలిపారు. సమాజంలో చోటుచేసుకునే సంఘటనలను క్షణాల్లో బంధించి ప్రజల ముందుకు తీసుకురావడంలో ఫోటో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ప్రకృతి విపత్తులు, ప్రమాదాలు, సామాజిక సంఘటనలు వంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి వృత్తి నిబద్ధతతో పనిచేయడం వారి గొప్పతనమని కొనియాడారు. ఏపీపీజేఏ ప్రతి సంవత్సరం చేపడుతున్న కార్యక్రమాలు సభ్యుల మధ్య ఐక్యతను పెంపొందించడమే కాకుండా, వృత్తిగత నైపుణ్యాలను మెరుగుపరచడానికి దోహదపడుతున్నాయని ప్రశంసించారు. ఫోటో జర్నలిస్టుల సంక్షేమం కోసం అసోసియేషన్ చేపడుతున్న చర్యలు అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీపీజేఏ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు, సీనియర్ ఫోటో జర్నలిస్టులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు తమ సంస్థ కార్యకలాపాలు, జర్నలిస్టుల సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలను కలెక్టర్‌కు వివరించారు. అనంతరం అసోసియేషన్ ప్రతినిధులు కలెక్టర్ డా. జి. లక్ష్మీశను ఘనంగా సత్కరించారు...

# స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎండితో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు భేటీ

## నరసరావుపేట నియోజకవర్గ పారిశుద్ధ్య నిధులపై చర్చ





నరసరావుపేట పెన్ పవర్ మార్చి 23: నరసరావుపేట నియోజకవర్గ పారిశుద్ధ్య వ్యవస్థను మరింత మెరుగుపరచడం మరియు పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేయడమే లక్ష్యంగా శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఆయన అమరావతిలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం. అనిల్ కుమార్ రెడ్డి ని కలిసి నియోజకవర్గ సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా నరసరావుపేట మున్సిపాలిటీతో పాటు నియోజకవర్గంలోని వివిధ గ్రామ పంచాయతీలకు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ నుండి అందాల్సిన నిధుల గురించి ఎమ్మెల్యే ప్రత్యేకంగా ప్రస్తావించారు. పట్టణ మరియు గ్రామీణ ప్రాంతాల్లో చెత్త సేకరణ, పారిశుద్ధ్య నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన కోసం నిధులను తక్షణమే విడుదల చేయాలని కోరారు. అలాగే, మున్సిపాలిటీకి మరియు పంచాయతీలకు అవసరమైన అదనపు వాహనాలు, ఇతర పరికరాల మంజూరు గురించి ఎండి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన ఎండి అనిల్ కుమార్ రెడ్డి నరసరావుపేట నియోజకవర్గంలోని పారిశుద్ధ్య పనులకు సంబంధించి రావలసిన నిధులను విడుదల చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నియోజకవర్గాన్ని పరిశుభ్రంగా, ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి కొనసాగుతుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పేర్కొన్నారు.

# చిన్న వయసులో పెద్ద ప్రతిభ

## మూడవ తరగతి విద్యార్థి అద్భుత చిత్రకళ

## బాపట్ల కలెక్టర్ చే ప్రశంస





పెన్ పవర్ బ్యూరో బాపట్ల మార్చి 23: బాపట్ల చిన్న వయసులోనే అసాధారణ ప్రతిభను ప్రదర్శిస్తూ మూడవ తరగతి చదువుతున్న ఒక విద్యార్థి అందరి ప్రశంసలు పొందుతున్నాడు. ప్రముఖుల ముఖ చిత్రాలను తన చేతి ప్రతిభతో చిత్రీకరిస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. బాపట్ల జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ ముఖచిత్రాన్ని తన చేతి ప్రతిభతో చిత్రీకరించి సోమవారం కలెక్టర్ ఛాంబర్ లో కలెక్టర్ కు బహుకరించాడు.

వివరాల్లోకి వెళితే... బాపట్ల పట్టణం శృంగారపురానికి చెందిన అక్కి శ్రీను యాదవ్, రేవతి దంపతులకు చెందిన అక్కి శ్రీరామ్ రిషిత్ యాదవ్ అనే విద్యార్థి పట్టణంలోని జేమ్స్ హైస్కూల్లో మూడవ తరగతి చదువుతున్నాడు. చదువుతోపాటు చిత్ర కళల పట్ల ఆసక్తిని చూపడం, ప్రముఖుల ఫోటోలను చూసి పెన్సిల్, కలర్స్ సహాయంతో అద్భుతంగా చిత్రీకరించడం విశేషం. విద్యార్థి చిత్రీకరించిన చిత్రాలలో భావవ్యక్తీకరణ, కళ్ళలోని జీవం, చిత్రీకరణ పై పెట్టిన శ్రద్ధ చూస్తే పెద్ద ఆర్టిస్టులు గీసిన చిత్రాలకు ధీటుగా ఉన్నాయంటే చిన్నారికి చిత్ర కళ లంటే ఎంత ఆసక్తి వుందో అర్థం చేసుకోవచ్చు.

చిన్నప్పటినుండే బొమ్మలు గీయడం పట్ల ఆసక్తి : విద్యార్థి తల్లిదండ్రులు

తమ కుమారునికి చిన్నప్పటినుండే డ్రాయింగ్ పట్ల ఆసక్తి ఉండేదని, డ్రాయింగ్ సాధన కోసం రోజు కొంత సమయం కేటాయించేవాడని తెలిపారు. జేమ్స్ స్కూల్ ఉపాధ్యాయ సిబ్బంది కూడా తమ కుమారుని ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. సరైన మార్గదర్శకం, ప్రోత్సాహం ఉంటే తమ కుమారుడు మరింత మంది ప్రముఖుల చిత్రాలను డ్రాయింగ్ రూపంలో గీసి తన ప్రతిభను చాటుతాడని ఆశాభావం వ్యక్తం చేశారు.

కలెక్టర్ బి వినోద్ కుమార్ ప్రశంస

మూడవ తరగతి చదువుతున్న అక్కి శ్రీరామ్ రిషిత్ యాదవ్ తన ముఖచిత్రాన్ని డ్రాయింగ్ రూపంలో గీసి తనకే బహుకరించడం పట్ల చాలా సంతోషంగా ఉందని కలెక్టర్ బి వాసుదేవ్ కుమార్ అన్నారు. ఈ చిన్నారి భవిష్యత్తులో మరెన్నో చిత్రాలను అద్భుతంగా గీసి జాతీయస్థాయిలో గుర్తింపు పొందాలని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఏ ఏ రంగాల్లో రాణిస్తున్నారు గుర్తించి ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలని సూచించారు.

# ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ శాంతి ప్రియా తో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు మర్యాదపూర్వక భేటీ



నరసరావుపేట పెన్ పవర్ మార్చి 23: నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు సోమవారం అకౌంటెంట్ జనరల్ కార్యాలయంలో ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ శాంతి ప్రియా ను మర్యాదపూర్వకముగా కలిశారు. ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమన్వయ భేటీ ల్లో భాగంగా ఆయన ఈ పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శాంతి ప్రియా ఖకి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ నిధుల వినియోగం, ఆడిటింగ్ ప్రక్రియలు మరియు వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలపై అధికారులతో చర్చించారు. ప్రభుత్వ పాలనలో పారదర్శకతను పెంపొందించేందుకు, అభివృద్ధి పనుల నిధుల విడుదలలో సాంకేతిక ఇబ్బందులు లేకుండా చూసేందుకు అకౌంటెంట్ జనరల్ కార్యాలయం అందిస్తున్న సహకారం పట్ల ఎమ్మెల్యే తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి తగిన సూచనలు, సలహాలు అందించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

# తన సొంత వాహనానికి మైక్ కట్టుకొని ఇంటి పన్ను వసూళ్ల కోసం ఎంపీడీవో శ్రీనివాసరావు ప్రయత్నం



పెన్ పవర్ బ్యూరో బాపట్ల మార్చి 23: కర్లపాలెం మండలంలో ఉన్న 20 పంచాయతీల్లో కేవలం ఏడు పంచాయతీలు మాత్రమే నూరు శాతం ఇంటి పన్నులు చెల్లించాలని మిగిలిన 13 పంచాయతీలు డెబ్బై శాతం మాత్రమే ఇంటి పన్ను వసూలు అయ్యాయని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలియజేశారు సోమవారం పేరలి పంచాయతీలో తన సొంత వాహనానికి మైకట్టుకొని ప్రజలందరూ ఇంటి పన్ను చెల్లించాలని విస్తృతంగా ప్రచారం చేశారు ఈ నెల ఆఖరిలోపు కచ్చితంగా కర్లపాలెం మండలంలో ఉన్న అన్ని పంచాయతీలు నూటికి నూరు శాతం ఇంటి పొన్ను వసూలు అయ్యేలా వివిధ శాఖలో ఉన్న ప్రభుత్వ అధికారులు పనిచేయాలని ఆయన తెలియజేశారు ఇంటి పన్ను వసూలు అయినప్పుడే గ్రామాలు అభివృద్ధి చేసుకోవచ్చున్నారు.

# జిల్లా కలెక్టర్ అధ్యక్షతన రెండవ మీడియా అక్రెడిటేషన్ కమిటీ సమావేశం -- 81 మందికి మంజూరు





నరసరావుపేట పెన్ పవర్ మార్చి 23: పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా అధ్యక్షతన సోమవారం జిల్లా స్థాయి రెండవ మీడియా అక్రెడిటేషన్ కమిటీ సమావేశం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రెండవ విడతలో 81 మంది జర్నలిస్టుల అక్రెడిటేషన్ దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి ఆమోదించినట్లు ఆమె తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు, ప్రమాణాలు పాటిస్తూ పారదర్శకంగా అక్రెడిటేషన్‌లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. మీడియా ప్రతినిధులు ప్రజలకు మరియు ప్రభుత్వానికి మధ్య వారధిగా వ్యవహరిస్తూ, జిల్లా అభివృద్ధిలో భాగస్వాములవాలని, తమ విలువైన సూచనలు, సలహాలు అందించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ సమావేశంలో జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి దీప్తి, డీపీఆర్వో ఓహం ప్రకాష్, ఆర్టీసీ అధికారి, వైద్య ఆరోగ్య శాఖ, కార్మిక శాఖ అధికారులు మరియు మీడియా అక్రెడిటేషన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# నరసరావుపేటలో బైక్ స్టంటర్లపై పోలీసుల ఉక్కుపాదం -- ప్రత్యేక బృందాల ఏర్పాటు



నరసరావుపేట పెన్ పవర్ మార్చి 23: నరసరావుపేట పట్టణంలో ప్రధాన రహదారులపై ప్రమాదకరంగా బైక్ స్టంట్లు, రేసింగ్‌లు నిర్వహిస్తూ ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగిస్తున్న వారిపై పోలీసులు కఠిన చర్యలు ప్రారంభించారు. ఈ మేరకు నరసరావుపేట ఇన్‌చార్జి డీఎస్పీ హనుమంతరావు సోమవారం మీడియాతో మాట్లాడారు. ఇటీవల యువత బైక్ స్టంట్లతో ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్న నేపథ్యంలో, ఈ సమస్యను అరికట్టేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ప్రత్యేక చర్యలు: జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాలు, ప్రధాన కూడళ్లలో పోలీసులు మారువేషంలో పహారా కాస్తున్నారన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా సీసీటీవీ కెమెరాలతో పట్టణంలోని కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు అని చెప్పారు.ల స్టంట్లు చేస్తూ కెమెరాలకు చిక్కిన వారిపై తక్షణమే కేసులు నమోదు చేస్తున్నాము అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహనాలను అక్కడికక్కడే సీజ్ చేస్తున్నాము అని చెప్పారు.

పోలీసుల విజ్ఞప్తి:

ఈ సందర్భంగా పోలీసులు యువతకు, తల్లిదండ్రులకు ప్రత్యేక విజ్ఞప్తి చేశారు.

యువత తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను ప్రమాదంలో పడేసే ఇలాంటి స్టంట్లకు దూరంగా ఉండాలి. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిరంతరం నిఘా ఉంచాలి అని సూచించారు.

ప్రజా భద్రతే ప్రధాన లక్ష్యం:

బైక్ స్టంట్ల వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలగడమే కాకుండా, పాదచారులు మరియు ఇతర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని అధికారులు పేర్కొన్నారు. ఈ సమస్యను శాశ్వతంగా నివారించేందుకు జీరో టాలరెన్స్ విధానాన్ని కట్టుదిట్టంగా అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

# ఆలోచనలు మారితేనే అధిక లాభాలు : ప్రత్తిపాటి

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడానికే ప్రభుత్వం రైతన్నా మీకోసం కార్యక్రమం ద్వారా రైతుల్లో చైతన్యం తీసుకొస్తోంది

డిమాండ్ ఉన్న పంటల సాగుతో రైతులు తప్పక లాభాలు పొందుతారు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రాయితీలు, ప్రోత్సాహకాలు, దిగుబడినిచ్చే పంటలపై రైతులకు అవగాహన తప్పనిసరి

అమీన్ సాహెబ్ పాలెం, అప్పాపురం గ్రామాల్లో రైతన్నా మీకోసంలో మాజీమంత్రి

అమీన్ సాహెబ్ పాలెంలో రూ.10లక్షలతో నిర్మించిన సీసీరోడ్డు ప్రారంభించి, మరో రూ.10లక్షలతో వేసే సీసీరోడ్డుకు శంకుస్థాపన చేసిన ప్రత్తిపాటి





చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 23 : చిలకలూరిపేట : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకుంటూ, కాలానికి తగినట్టు తమ ఆలోచనలు, సాగు విధానాలు మారుస్తూ, డిమాండ్ ఉన్న పంటల సాగుద్వారా రైతుల అధిక లాభాలు అర్జించాలని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. సోమవారం ఆయన నాదెండ్ల మండలం అమీన్ సాహెబ్ పాలెం, అప్పాపురం గ్రామాల్లో నిర్వహించిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తొలుత అమీన్ సాహెబ్ పాలెంలో రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించిన ప్రత్తిపాటి, మరో రూ.10లక్షలతో నిర్మించాల్సిన సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం పలువురు రైతుల ఇళ్లకు వెళ్లి, ప్రభుత్వం సేద్యానికి, రైతులకు అందిస్తున్న సాయాన్ని వివరించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటుచేసిన బహిరంగసభలో మాట్లాడారు. రైతాంగం ఆలోచనలు, సాగు విధానాలు మారితేసే సేద్యంతో అధికలాభాలు పొందడం సాధ్యమవుతుందని, ఈ విషయంపై ప్రతి రైతు తప్పకుండా ఆలోచన చేయాలని ప్రత్తిపాటి సూచించారు. ప్రభుత్వం ఎక్కువ ప్రోత్సాహకాలు, రాయితీలు అందించే ఉద్యాన పంటలసాగుపై రైతాంగం దృష్టి సారించాలని, తొలిసారి సాగుచేపట్టేటప్పుడు రైతులు చిన్నచిన్న సమస్యలు ఎదుర్కొన్నా..తర్వాత అధిక లాభాలు పొందుతారని ప్రత్తిపాటి చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఏటా పంటలసాగుకు సంబంధించిన వివరాలు వెల్లడిస్తాయని, వాటి ఆధారంగా ఏ ప్రాంతంలో ఏ పంటలు వేస్తే బాగుంటుందనే ఆలోచన చేసి రైతులు సాగుకు సన్నద్ధం కావాలని ప్రత్తిపాటి సూచించారు. డిమాండ్ అధికంగా ఉన్న పంటల సాగుతో కచ్చితంగా లాభాలు పొందుతారన్నారు. మిర్చి, పత్తి, పొగాకు వంటి వాణిజ్య పంటల సాగుకు అలవాటు పడిన రైతులు, వేరే పంటల సాగుపై మొగ్గుచూపడానికి ఇష్టపడటం లేదని, వారు కొత్త ఆలోచనలు చేయాలనే ప్రభుత్వం రైతన్నా మీకోసం కార్యక్రమం చేపట్టిందన్నారు. ఆదర్శ రైతులు, వ్యవసాయాధికారులు నిత్యం రైతులతో మాట్లాడుతూ, వారిలోచైతన్యం నింపాలని, వారిని కొత్త సాగు విధానాల వైపు మళ్లించాలని ప్రత్తిపాటి సూచించారు. కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, జవ్వాజి మధన్ మోహన్, కామినేని సాయిబాబు, రైతు నాయకులు గుర్రం నాగపూర్ణ చంద్రరావు, గ్రామ నాయకులు పునాటి కోటేశ్వరరావు, గుర్రం రామారావు, గుర్రం ఉపేంద్ర, సర్పంచి కామినేని లలిత ,

నెల్లూరి రామారావు, గ్రామ నాయకులు నెల్లూరి హరిబాబు, జగదీష్ , గొట్టిపాటి రామారావు, మస్తాన్ వలి, శంకర్ రావు, అధికారులు ఏవో శ్రీలత, పంచాయతీ ఏఈ వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవాది సయ్యద్ వాహబ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్



చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 23 : చిలకలూరిపేట : పట్టణ ప్రముఖ న్యాయవాది, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ వాహబ్ ని శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ పరామర్శించారు. గత వారం వాహబ్ బైక్‌పై వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో స్వల్ప గాయాలపాలై ప్రస్తుతం స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, సోమేపల్లి వెంకటసుబ్బయ్య తో కలిసి ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్న ఎమ్మెల్సీ, వాహబ్ త్వరితగతిన పూర్తి ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించి వారికి ధైర్యం చెప్పారు. అనంతరం పట్టణంలోని మరో సీనియర్ నాయకులు ఎంబిటి సుభాని మేస్త్రి ని కూడా కలిసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారితో కాసేపు ఆప్యాయంగా ముచ్చటించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో సయ్యద్ హిదాయితుల్లా, గోల్డ్ సుభాని, సాతులూరి కోటి, యూత్ జిలాని, ఓల్డ్ గన్ని యూత్ అధ్యక్షులు నాసర్ వలి తదితరులు పాల్గొన్నారు.

# వడ్డీ లేకుండా పన్ను చెల్లించడానికి 8 రోజులే గడువు....కమిషనర్ కె.మయూర్ అశోక్...






పెన్ పవర్, గుంటూరు, మార్చి, 23. గుంటూరు నగరపాలక సంస్థకు వడ్డీ లేకుండా పన్ను బకాయిలు చెల్లించడానికి ఈ నెలాఖరువరకే గడువు ఉందని, ఆస్తి, ఖాళీ స్థల, నీటి చార్జీలు కలిపి సోమవారం ఒక్కరోజే రూ.2.45 కోట్లు పన్నుచెల్లించారని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు పన్ను వసూళ్ల వేగవంతంలో భాగంగా డిప్యూటీ కమిషనర్లు, రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పన్ను బకాయిల చెల్లింపుపై బకాయిదారుల నుండి మంచి స్పందన ఉందని, నూరు శాతం పన్ను వసూళ్ళే లక్ష్యంగా అధికారులు వార్డ్ సచివాలయం వారీగా యాక్షన్ ప్లాన్ మేరకు వెళ్లాలన్నారు. పెద్ద మొత్తంలో బకాయి ఉన్న వారిని డిప్యూటీ కమిషనర్లు నేరుగా కలిసి పన్ను చెల్లించేలా తెలియచేయాలని, స్పందించకుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అడ్మిన్ కార్యదర్శులు మార్చి నెల ముగింపుకు 8 రోజులే గడువు ఉన్నందున మరింత యాక్టివ్ గా విధుల్లో ఉండాలని, నిర్లక్ష్యంగా ఉండే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెడ్ నోటీసులు జారీ చేసినా స్పందించని వారి ఆస్తుల జప్తుకు చర్యలు తీసుకోవాలన్నారు. ట్యాక్స్ కలెక్షన్ కేంద్రాలు కూడా ఉదయం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు పని చేస్తాయని, నగర ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు....

# రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ .... రాజధాని అభివృద్ధి వేదిక ఆందోళన




తుళ్లూరు (అమరావతి) : పెన్ పవర్ ప్రతినిధి మార్చి 23: రాజధాని అమరావతిలో రైతులు, రైతు కూలీలు, కార్మికులు, టిడ్కో గృహ లబ్ధిదారులు, తదితరులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ... రాజధాని అభివృద్ధి వేదిక నాయకులు వై.నేతాజీ సోమవారం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాజధాని అమరావతిలోని రాయపూడి సి ఆర్ డి ఎ కార్యాలయం వద్ద రాజధాని అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో ఈరోజు పేదలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ .... రాజధాని అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో మార్చి 13 నుంచి 18 వరకు రాజధాని ప్రాంతంలోని పలు గ్రామాల్లో 100 కిలోమీటర్ల మేర పాదయాత్ర నిర్వహించడం జరిగిందన్నారు. ప్రజానీకం తాము ఎదుర్కొంటున్న సమస్యలను పాదయాత్ర బృందం దృష్టికి తీసుకువచ్చారని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సి ఆర్ డి ఎ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టడం జరిగిందన్నారు. రాయపూడి నుండి తాడికొండ అడ్డరోడ్డు వరకు ప్రధాన రహదారి గుంతలమయంగా మారి ప్రయాణం నరకప్రాయంగా ఉందని, ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన నేతాజీ వ్యక్తం చేశారు. ప్రభుత్వం అలసత్వం వీడి తక్షణమే యుద్ధప్రాతిపదికన రోడ్డు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. తుళ్లూరులో గతంలో టిడిపి ప్రభుత్వం లోనే 30 పడకల ఆసుపత్రి నిర్మాణం జరిగిందని, నేటికీ వైద్యులు, సిబ్బంది, వైద్య పరికరాలను సమకూర్చలేదన్నారు. దీంతో ఆసుపత్రి అలంకారప్రాయంగా మారిందన్నారు. తక్షణమే వైద్యులను నియమించి 30 పడకల ఆసుపత్రిని అందుబాటులోకి తేవడంతోపాటు 100 పడకల ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేయాలన్నారు. 200 పడకలతో రాజధాని ప్రాంతంలో ఈ ఎస్ ఐ ఆసుపత్రి నిర్మాణం చేయాలని, రాజధాని ప్రజలకు ఉచిత వైద్యం అందించేందుకు అన్ని కార్పొరేట్ ఆసుపత్రులలో చెల్లుబాటు అయ్యేలా కొత్తగా హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. రాజధాని గ్రామాల్లో కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ – – హెల్త్ సెంటర్లు, అంగన్వాడీ కేంద్రాలను తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. భూమిలేని పేదలకు ఇచ్చే అమరావతి పింఛన్ ను రూ 5 వేల నుంచి రూ 10 వేలకు పెంచి మరో పదేళ్లు ఇవ్వాలన్నారు. రాజధానిలో కొత్తగా పెళ్లిచేసుకున్నవారికి కూడా అమరావతి సామాజిక పింఛన్ రూ 10 వేలు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని నేతాజీ విజ్ఞప్తి చేశారు. సి ఆర్ డి ఎ కార్యాలయంలో అధికారులు తమను పట్టించుకోవడం లేదని రైతులు పాదయాత్ర దృష్టికి తీసుకువచ్చారని, తక్షణమే రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. రాజధానిలో ఉపాధి లేనివారిని పట్టించుకోకుండా వేరే రాష్ట్రాల కార్మికుల చేత నిర్మాణ పనులు చేయిస్తున్నారని, వారి చేత 12 గంటలు పనిచేయిస్తూ కేవలం రూ 250లు చెల్లిస్తూ శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారని మండిపడ్డారు. మంగళగిరి, తాడేపల్లి ప్రాంతంలో కార్మికులకు రూ 21 వేలు ఇస్తుంటే సి ఆర్ డి ఎ,హైకోర్టు, సచివాలయం, రాజధాని గ్రామాల్లో పనిచేస్తున్న కార్మికులకు మాత్రం కేవలం రూ 12 నుంచి 15 వేల చొప్పున వేతనం ఇస్తున్నారని అన్నారు. రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులు, రైతు కూలీల పిల్లలకు విట్, అమఅత, ఎస్ ఆర్ ఎం లాంటి విద్యాసంస్థల్లో ఉచితంగా విద్య నందిస్తామని ఇచ్చిన హామీ అమలు కావడం లేదన్నారు. ఒక్కో విద్యార్థి రూ 4 నుంచి 6.50 లక్షల వరకు ఫీజులు కడుతున్నారని అన్నారు. ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి పెట్టాలన్నారు. రాజధానిలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఐఐటి ఏర్పాటు చేయాలన్నారు. ఎం రవి మాట్లాడుతూ .... రాజధాని ప్రాంతంలో పెద్దలు ఇళ్ల స్థలాల కోసం అర్జీలు పెట్టి విసిగిపోయారని అన్నారు. రాజధాని పేదలకు మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు మంజూరు చేసి నిర్మాణం నిమిత్తం ఒక్కో లబ్ధిదారులకు రూ 5 లక్షలు చొప్పున ప్రభుత్వం సాయం చేయాలన్నారు. టిడ్కో ఇల్లు వద్దు.. ఇళ్ల స్థలాలే ముద్దు అనే స్థితికి రాజధాని పేదలు వచ్చారని అన్నారు. టిడ్కో ఇల్లు సమస్యలకు నిలయంగా మారాయని, ఇళ్ల పైకప్పులలో చెమ్మ వస్తోందని, తాగునీరు సక్రమంగా అందడం లేదని, డ్రగ్స్ మాఫియా ఆగడాలు పెరిగిపోయాయని అన్నారు. దీంతో పేదలు ఇళ్ల స్థలాలు కావాలని కోరుతున్నారన్నారు. పారిశుధ్య కార్మికులకు నేటి వరకు ఫిబ్రవరి నెల వేతనం చెల్లించలేదన్నారు. ఏజెన్సీ నిర్వాహకులు అబద్ధాలు చెబుతూ కాలయాపన చేస్తున్నారని, సి ఆర్ డి అధికారులు తక్షణమే కల్పించుకొని వేతనం చెల్లింపుకు చర్యలు తీసుకోవాలన్నారు. వేతనం చెల్లించని పక్షంలో ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. పార్లమెంట్ లో 21 మంది ఎంపిలు ఉండి కూడా రాష్ట్రానికి చట్టబద్ధత తీసుకురావడంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఎందుకు విఫలమవుతోందో ప్రజలకు చెప్పాలన్నారు.చట్ట బద్ధత కల్పించే అంశంలో టిడిపి కూటమి చిత్తశుద్ధిని ప్రజలు శంకించే పరిస్థితి వచ్చిందన్నారు. జీవో 36 ప్రకారం కార్మికులకు రూ 21వేలు వేతనం చెల్లించాల్సి ఉండగా రాజధాని ఆవిధంగా ఎందుకు జరగడం లేదో అర్థం కావడం లేదన్నారు. హైకోర్టులో పనిచేసే కార్మికులకు కేవలం రూ 11 వేల వేతనంతో సరిపెడతారా..అని రవి మండిపడ్డారు. రాజధాని గ్రామాల్లో రూ 906 కోట్లతో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ లాంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మున్సిపల్ శాఖా మంత్రి పి నారాయణ ఎంతోకాలంగా చెబుతున్నారని, పనులు మొదలు పెట్టడంలో జాప్యం ఎందుకు జరుగుతోందని ప్రశ్నించారు. రాజధాని సమస్యలను ఎప్పటిలోగా పరిష్కరిస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలన్నారు. అనంతరం సి ఆర్ డి ఎ అదనపు కమీషనర్ ఎ భార్గవ తేజకు అర్జీలను అందజేశారు. అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని అదనపు కమీషనర్ చెప్పారు. కార్యక్రమంలో బి.లక్ష్మణరావు, జె నవీన్ ప్రకాష్, పి బాబురావు, షేక్ జానీ,జెవి రాఘవులు, పి బాలకృష్ణ, బూరుగ వెంకటేశ్వర్లు, ఎస్ ఎస్ చెంగయ్య, పల్లె కఅష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రమేష్ బాబు మృతి పార్టీకి తీరని లోటు - ఎమ్మెల్యే ఆనందబాబు.



వేమూరు, భట్టిప్రోలు,పెన్ పవర్ మార్చి 23 తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తులము రమేష్ ఆకస్మిక మృతి పార్టీకి ఎంతగానో తీరనిలోటని వేమూరు శాసనసభ్యులు నక్కా ఆనందబాబు విచారణ వ్యక్తం చేశారు.వేమూరు మండలం కుచెల్లపాడు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తులం రమేష్ బాబు(55) అనారోగ్య కారణాలతో సోమవారం మృతి చెందారు. రమేష్ బాబు మృతి వార్త తెలుసుకొని ఎమ్మెల్యే తీవ్ర విచారం వ్యక్తం చేశారు.ఆనంద బాబు కుచ్చెళ్ళపాడు విచ్చేసి రమేష్ బాబు మృతదేహాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,రమేష్ బాబు పార్టీకి నిబద్ధతతో,గ్రామ అభివృద్ధికి అంకితభావంతో పనిచేసిన నాయకుడని కొనియాడారు. ఆయన మరణం పార్టీకి,గ్రామానికి తీరని లోటని తెలిపారు. కుచెల్లపాడు గ్రామంలో పార్థివ దేహానికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే, రమేష్ బాబు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. దివంగతుని ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ దుఃఖాన్ని తట్టుకునే ధైర్యం కలగాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక

## అర్జీల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి పెట్టాలి --- జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా



నరసరావుపేట పెన్ పవర్ మార్చి 23: పల్నాడు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ మండలాలనుండివచ్చిన అర్జీదారుల నుండి జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా అర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు అర్జీల స్వీకరణ కార్యక్రమంలో జిల్లా ఆదాయ అధికారి, వివిధ శాఖల జిల్లా అధికారులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి మొత్తం 109 అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధతో పని చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అర్జీలను నాణ్యతతో, సమయానికి పరిష్కరించాలన్నారు. ప్రతి అర్జీదారుతో మాట్లాడి వారి సమస్యలను పూర్తిగా అర్థం చేసుకుని పరిష్కారం చూపాలన్నారు. అలాగే, శాఖల వారీగా అర్జీలపై సమీక్ష నిర్వహించి పెండింగ్‌లో ఉన్న అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. జిల్లా పరిధిలో ఎలాంటి పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# జాతీయ రహదారిలో రెండు రోడ్డు ప్రమాదాలు -- ఒక వ్యక్తి మృతి, పలువురికి గాయాలు

చీరాల (బాపట్ల) : పెన్ పవర్ ప్రతినిధి మార్చి 23: వాడరేవు జాతీయ రహదారిలో కారంచేడు సమీపంలో ఆదివారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాలు విషాదాన్ని మిగిల్చాయి. ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందగా మరికొందరు గాయపడ్డారు. మొదటి ఘటనలో కారంచేడు గ్రామానికి చెందిన కొర్రపాటి వెంకటేశ్వరరావు (46) ద్విచక్ర వాహనంపై చీరాల వైపు ప్రయాణిస్తుండగా వెనుక నుంచి వచ్చిన ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. అయితే ఇదే సమయంలో మొదటి ప్రమాద స్థలం నుండి సుమారు 50 మీటర్ల దూరంలో మరో ప్రమాదం చోటుచేసుకుంది. వినుకొండ నుంచి వాడరేవు రిసార్ట్‌కు డీజే కార్యక్రమానికి వెళ్తున్న టాటా ఏసీ వాహనం, పంగులూరు మండలం రామకూరు గ్రామానికి చెందిన కుటుంబ సభ్యులు ప్రయాణిస్తున్న ఆటోను ఢీకొట్టింది. రంజాన్ పండుగ ముగిసిన సందర్భంగా సముద్ర స్నానానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ కాలేషావలి, అతని భార్య హయ్యద్‌బీతోపాటు మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడినవారిని చికిత్స నిమిత్తం సమీప ఏరియా వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న కారంచేడు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# బైపాస్ నిర్మాణంలో మళ్లీ సాగు భూములను వదులుకోలేం : రైతులు

నందిగామ (ఎన్‌టిఆర్) : పెన్ పవర్ ప్రతినిధి మార్చి 23: విజయవాడ-హైదరాబాద్ 6 వరుసల బైపాస్ నిర్మాణంలో మార్పులు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మలుపులు లేని రహదారి కోసం కాచవరం-మూలపాడు, అంబార్పేట-ఐతవరం మధ్య కొత్తగా బైపాస్‌లను ప్రతిపాదించారు. దీనివల్ల 350 ఎకరాల భూమి, 500 ఇళ్లు కోల్పోవాల్సి వస్తుందని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు భూములిచ్చామని, మళ్లీ సాగు భూములను వదులుకోవడానికి సిద్ధంగా లేమని రైతులు తెగేసి చెబుతున్నారు.

## విజయవాడ ఇంద్రకీలాద్రిపై శ్రీ కనకదుర్గమ్మను దర్శించుకున్న నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు



నరసరావుపేట పెన్ పవర్ మార్చి 23: నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు సోమవారం విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న జగన్మాత శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో అధికారులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం చదలవాడ అరవింద బాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు ఆయనకు ఆశీర్వచనాలు అందించి, అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లోకపావని, దుష్టశిక్షణ శిష్టరక్షణ చేసే ఆ కనకదుర్గమ్మ ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నాను. ముఖ్యంగా నరసరావుపేట నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించాను. రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోవాలని, కూటమి ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరాలని ఆకాంక్షించాను. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొన్నారు.

# ఘనంగా భగత్ సింగ్ వర్ధంతి వేడుక



భట్టిప్రోలు, పెన్ పవర్ మార్చి, 23: బ్రిటిష్ సామ్రాజ్యాధిపతులను భారతదేశ నుండి తరిమి కొట్టడానికి చిన్ననాటి నుండి స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొని ప్రాణాలను తృణ ప్రాయంగా భావించి దేశం కోసం ప్రాణత్యాగం చేసిన భగత్ సింగ్ చిరస్మరణీయులని భట్టిప్రోలు ఎంపీడీవో సాతులూరి వెంకటరమణ అన్నారు. సోమవారంమండల కేంద్రమైన భట్టిప్రోలు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో భగత్ సింగ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ స్వాతంత్రం అనంతరం దేశం లో ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జీవించటానికి భగత్ సింగ్ స్ఫూర్తిదాయకమన్నారు. నేటి యువత భగత్ సింగ్ స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవోలు మల్లికార్జునరావు, విజయబాబు, ఏవో జలజ, ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ, సీసీలు, వివోఏలు తదితరులు పాల్గొన్నారు.


01

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

క్లాసిఫైడ్ యాడ్స్

కేవలం

యాడ్ 100/-కే

'ఐదు రోజులకు'

'4 సెం.మీ 4 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి'

93948 55244

పరతులు వర్తిస్తాయి


# 24,25 తేదీలలో అన్నదాత సుఖీభవ-ఇంటింటి ప్రచారం.



భట్టిప్రోలు, పెన్ పవర్ మార్చి, 23: వేమూరు నియోజకవర్గంలోని భట్టిప్రోలు వేమూరు మండలాలలో ని రెండు గ్రామాలలో అన్నదాత సుఖీభవ కార్యక్రమాలు జరుగునున్నట్లు శాసనసభ్యులు క్యాంపు కార్యాలయం సిబ్బంది ఆదివారం తెలిపారు. 24వ తేదీ మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు భట్టిప్రోలు మండలం పెదపులివర్రు గ్రామంలోను, 25వ తేదీ వేమూరు మండలం కాకర్లమూడి గ్రామంలో బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు అన్నదాత సుఖీభవ-ఇంటింటి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ రెండు రోజులు కార్యక్రమాలలో మాజీ మంత్రి వేమూరు శాసనసభ్యులు నక్క ఆనందబాబు పాల్గొంటారని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆయా మండలాల పార్టీ నాయకులు తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి



చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 23 : ఎడ్లపాడు: జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం లో ఒక వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... సోమవారం ఒంగోలు నుండి వెన్నపూస లోడుతో విజయవాడ వెళుతున్న టాటా మేజిక్ వాహనం ఆగి ఉన్న లారీని ఢీ కొట్టగా డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ నిద్రమత్తె కారణమని స్థానికులు తెలిపారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# పేట పట్టణంలో కార్డెన్ సెర్చ్ : 30 బైక్‌లు స్వాధీనం




చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 23 : చిలకలూరిపేట : పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు సోమవారం తెల్లవారుజామున భారీ స్థాయిలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సంజీవ్‌నగర్, ఆది ఆంధ్ర కాలనీల్లో డీఎస్పీ హనుమంతరావు పర్యవేక్షణలో, అర్బన్ సీఐ పి. రమేష్ మరియు సిబ్బంది ఈ తనిఖీలు చేపట్టారు. ఈ ఆకస్మిక తనిఖీల్లో సరైన పత్రాలు లేని 30 మోటార్ సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ హనుమంతరావు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణంలో శాంతిభద్రతలను కాపాడేందుకే ఇటువంటి తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

# ధరణికోట లో జరిగిన రైతన్నా - మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్





అమరావతి పెన్ పవర్ ప్రతినిధి మార్చి 23: రైతులతో మమేకమై రైతులకు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించిన ఎమ్మెల్యే. అన్నదాత సుఖీభవ పథకం కింద మండలంలో 0,259 మంది రైతుల ఖాతాల్లో 20.4 కోట్లు జమ అయిందన్నఎమ్మెల్యే. వ్యవసాయం అంటే దండగా కాదుపండగఅని నిరూపించేలా రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందన్న ఎమ్మెల్యేరానున్న రోజుల్లో మరింతగా వ్యవసాయాన్ని లాభ సాటిగా చేసే విధంగా కొత్త పథకాలను కూటమి ప్రభుత్వం రూపొందిస్తుందన్న ఎమ్మెల్యే. కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు, మండల పార్టీ అధ్యక్షులు మరియు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# కోనేటిపురం లో పి ఎం డి ఎస్ విత్తన గుళికలు తయారీ.



భట్టిప్రోలు పెన్ పవర్ ప్రతినిధి మార్చి 23: భట్టిప్రోలు మండలం కోనేటి పురం గ్రామంలో పి ఎం డి ఎస్ విత్తన గుళికలు తయారు చేశారు ఈ కార్యక్రమానికి విచ్చేసిన జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సయ్యద్ అక్తర్ హుస్సేన్ మాట్లాడుతూ విత్తన గుళికలు తయారు చేసే విధానాన్ని తెలిపారు విత్తన గుళికలు తయారు చేయడానికి కావలసిన పదార్థాలు పి ఎం డి ఎస్ విత్తనాలు బీజామృతం, బాగా జల్లించిన బంక మట్టి, మంచినీరు, బాగా జల్లించిన ఘన జీవామృతం, బాగా జల్లించిన బూడిద, గోనె సంచి కావాలన్నారు తయారు చేసే విధానాన్ని తెలుపుతూ ముందుగా విత్తనాలను ప్లాస్టిక్ ట్రే లో కి తీసుకుని జీవామృతంతో తడిసి తడవనట్టుగా విత్తన శుద్ధి చేయాలి తర్వాత జల్లించిన బంకమట్టితో విత్తనం 3- 5 రెట్లు అయ్యేవరకు పొరలు పొరలుగా వేస్తూ ఉండాలి. ఆ తర్వాత బాగా జల్లించిన ఘనజీవామృతం పొడిని నీటిని ఉపయోగించి విత్తనం పాత్రని గుండ్రంగా తిప్పుతూ ఉండాలి విత్తనం మూడు రెట్లు అయ్యేవరకు ఇలా పొరలు పొరలుగా వేస్తూ ఉండాలి. బూడిదను చివరి పొరగా వేసుకోవాలి. ఇలా విత్తన గుళికలు మూడు నుంచి ఐదు రెట్లు అయిన తర్వాత వాటిని నీడలో ఆరబెట్టుకోవాలి తయారైన విత్తన గుళికలను పొలంలో 5 మీ. మీ లోతులో ఘనజీవామృతంతో వేసుకోవాలి ఇలా విత్తుకోవడం వల్ల బీజామృతంతో విత్తనాలను శుద్ధి చేయడం వల్ల విత్తనాలు తొందరగా మొలకెత్తడానికి అవసరమయ్యే హార్మోలను ప్రేరేపిస్తుంది నేల ద్వారా సంక్రమించే వ్యాధుల నుండి రక్షణ కల్పిస్తుంది ఈ విత్తన గుళికలు వాతావరణంలో కలిగే ప్రతికూల మార్పులను తట్టుకునే సామర్థ్యం పెంపొందించడం నేల ద్వారా గాలి ద్వారా విత్తనాల ద్వారా సంక్రమించే వ్యాధులను మరియు పురుగులను ఎదుర్కొనే సామర్థ్యం పెంచటం విత్తన గుళికలు చేయటం వలన విత్తనం ఆరు నెలల వరకు జీవంతో ఉంచటం సాధారణ విత్తనాలు విత్తడానికి కనీసం 22 - 25 మీ. మీ వర్షపాతం అవసరం వేసవిలో పొడి నేలలు విత్తనాలు మొలకెత్తడానికి తగిన తేమను కలిగి ఉండవు విత్తన గుళికలు విధానం ద్వారా కనీసం 10- 15 మిల్లీమీటర్ల తేమలో కూడా ఇవి మొలకెత్తుతాయి ఈ విత్తన గుళికలు సూర్యరశ్మి డైరెక్ట్ గా విత్తనాలు పై పడి విత్తనాలు వేలారిపోకుండా ఇలా గుళికలు తయారు చేసుకోవడం వల్ల విత్తనం 6 నెలల వరకు జీవంతో ఉంటుంది వర్షం పడినప్పుడు ఆ విత్తనాలు మొలకలు తయారవుతాయి వాటర్ సదుపాయం లేని పొలాలకు బాగా ఉపయోగపడుతుంది తక్కువ తేమతోనే ఇవి మొలకెత్తుతుంది ఎటువంటి తెగులు రాకుండా కాపాడుతుంది అని డి పి ఎం వివరించారు ఈ కార్యక్రమంలో ఎన్ ఎఫ్ ఏ శ్రీనివాసరావు, ఎం టి ఝాన్సీ ఎల్ 2 పాండురంగారావు, ఎఫ్ఎం టి బాలాజీ, బి ఆర్ సి లు చందోలు సుశీల,ప్రమీల, పానుగంటి సాంబశివరావు, డీ ఎమ్ ఎమ్ టి లు రాధిక, సుధారాణి, ఐ సి ఆర్ పి ఎస్ పరిశ ప్రసన్న ,రోజాన, రైతులు తదితరులు పాల్గొన్నారు

# ప్రపంచానికి ప్రమాదంగా సామ్రాజ్యవాదం : సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు రమాదేవి



విజయవాడ పెన్ పవర్ ప్రతినిధి మార్చి23. సామ్రాజ్యవాదం ప్రపంచ దేశాలపై యుద్ధాలకు దిగుతూ సామాన్య ప్రజలను చంపుతూ ప్రమాదకరంగా మారిందని, స్వాతంత్ర్య పోరాటవీరులు భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్ స్ఫూర్తితో దానికి వ్యతిరేకంగా పోరాడాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. తొలుత విప్లవవీరుల చిత్రపటాలకు రమాదేవి, వైవి తదితరులు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఎం ఆఫీసు కార్యదర్శి జె.జయరాం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రమాదేవి మాట్లాడారు. సోషలిస్టు సమాజం అయితేనే ప్రజలకు స్వేచ్ఛ సమానత్వం ఉంటుందని భగత్‌సింగ్ నమ్మారని అన్నారు. బ్రిటీష్‌వారికి వ్యతిరేకంగా చిన్న వయస్సులోనే స్వాతంత్ర్య పోరాటంలోకి దిగారని, సోషలిస్టు రిపబ్లికన్ ఆర్మీగా మార్చి యువతను చైతన్యం చేశారని తెలిపారు. ఆ క్రమంలోనే ఆనాటి జాతీయోద్యమ నాయకులు లాలలజపతిరారుమీద సాగిన దాడికి ప్రతీకారం తీర్చుకోవాలనుకున్నారని తెలిపారు. వ్యక్తులను చంపడం కాదని, బ్రిటీష్ ప్రభుత్వం పోయి స్వదేశీ పాలన రావాలని కోరుకున్నారని తెలిపారు. ప్రస్తుతం సామ్రాజ్యవాదం ఇరాన్‌పై దాడి చేయడం ద్వారా ప్రపంచ పెత్తనాన్ని నిలబెట్టుకునేందుకు ప్రయత్నిస్తోందని తెలిపారు. దీని ప్రభావం భారతదేశంపై అనేక రూపాల్లో ఉందని తెలిపారు. యుద్ధాలు పోవాలంటే సామ్రాజ్యవాదం పోవాలని, సమూలంగా మార్చాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రస్తుతం హిందూత్వం పేరిట విద్వేషాలను రెచ్చగొడుతున్నారని, వాటిని కూడా ఎదుర్కోవాలన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ .... 24 సంవత్సరాల చిన్నవయస్సులో బ్రిటీషర్లకు వ్యతిరేకంగా పోరాడుతూ ఉరితీయబడ్డారని అన్నారు. ఆయన నిరంతరం అధ్యయనం చేసేవారని, ప్రపంచ పరిణామాలు మన దేశంపై ఎలా ఉంటుందో అధ్యయనం చేసేవారన్నారు. సోషలిస్టు భావజాలాన్ని నిరంతరం పరిశీలించారని, అయితే నేటి పాలకులు సోషలిస్టు అనే పదాన్నే రద్దు చేయాలని చూస్తున్నారని, పైగా ఆయనకు పోటీగా వీరసావర్కర్‌ను ముందుకు తీసుకొస్తున్నారని తెలిపారు. బ్రిటీష్‌వారికి లంగిపోయిన వీరసావర్కర్ యువత బ్రిటీషు వారికి వ్యతిరేకంగా పోరాడకుండా చూస్తానని లేఖరు రాశారని, అటువంటి వ్యక్తిని భగత్‌సింగ్‌తో పోలిక పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. నేటి పాలకవర్గాలు ప్రజలను పట్టించుకోకుండా, యువతను పక్కదారి పట్టించేందుకు నిర్వీర్యం చేసేందుకు మద్యం, మాదకద్రవ్యాలు, గంజాయి వంటివాటిని ముందుకు తెస్తున్నాయని తెలిపారు. పైకిమాత్రం మాదకద్రవ్యాలను ఎదుర్కొనేందుకు కృషి చేస్తున్నామని ప్రచారం చేస్తున్నాయని తెలిపారు.

## రూ.కోట్లు తీసుకునే ప్రవచనకర్తకు పేదవాడి కోడిగుడ్డు దండగగా కనిపిస్తుందా? : ఎంపిపి అనగాని రవి



గన్నవరం (కృష్ణా) : పెన్ పవర్ ప్రతినిధి మార్చి 23: ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న పోషక భోజనం, కోడిగుడ్డుపై స్పందిస్తూ .... సోమవారం గన్నవరం ఎంపిపి అనగాని రవి మీడియాతో మాట్లాడారు. ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి వ్యాఖ్యలను ఉద్దేశించి ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. " గరికపాటి గారు.. ఏసి గదుల్లో కూర్చుని ఇచ్చే సలహాలు పేదవాడి బతుకు చిత్రానికి సరిపోవు " అంటూ మండిపడ్డారు. " అక్షరానికి ఆకలి తోడవ్వకూడదు. ఆకలి తీరితేనే అక్షరం అబ్బుతుంది. ప్రభుత్వ బడుల్లో ఇచ్చే భోజనం, కోడిగుడ్డును 'దండగ' అనడం మీ అహంకారానికి నిదర్శనం " అని ఎంపిపి అనగాని రవి విమర్శించారు.

# జనసేనలో అరవ రచ్చ

**కడప, మార్చి 23, పెన్ పవర్:** జనసేన పార్టీలో అంతర్గత పరిణామాలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా లైంగిక ఆరోపణలు ఎదుర్కొన్న రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం జనసేన అధిష్టానానికి, స్థానిక నాయకత్వానికి పెద్ద తలనొప్పిగా మారింది. పరిపాలనలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తనదైన ముద్ర వేయాలని చూస్తుంటే, పార్టీలోని అంతర్గత విభేదాలు మాత్రం తీవ్రమవుతున్నాయి. తాజాగా అరవ శ్రీధర్ వ్యవహారం పార్టీలో సెగలు రేపుతోంది పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘించారనే ఆరోపణలతో ఆయనను పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని అధిష్టానం ఆదేశాలు ఇచ్చింది. త్రిసభ్య కమిటీని కూడా వేసి విచారణ జరిపింది. ఈ క్రమంలో ఆయనపై కేసులు కూడా నమోదు అయ్యాయి. ఇక చర్యలు తీసుకున్నట్లు వార్తలు వచ్చినప్పటికీ, ఆయన మళ్ళీ పార్టీ జెండాతో కార్యక్రమాలు నిర్వహించడం వివాదానికి కేంద్రబిందువైంది. పార్టీ పరంగా ఆయన దూరంగా ఉండాలని అధిష్టానం చెప్పినా, శ్రీధర్ మాత్రం క్షేత్రస్థాయిలో జనసేన జెండాతో పర్యటనలు చేయడం స్థానిక నేతలను అయోమయంలో పడేస్తోంది.అరవ శ్రీధర్ తనకంటూ ఒక ప్రత్యేక వర్గాన్ని ఏర్పాటు చేసుకుని కార్యక్రమాలు నిర్వహిస్తుండటం సమాంతర వ్యవస్థగా మారిందని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. ఇది కేడర్ మధ్య చీలికకు దారితీస్తోందని అధిష్టానానికి ఫిర్యాదులు అందుతున్నాయి. కొన్ని సందర్భాల్లో పార్టీ విధానాలకు విరుద్ధంగా వ్యక్తిగత నిర్ణయాలు తీసుకోవడం, ఇటీవల జరిగిన కొన్ని పార్టీ అంతర్గత సమావేశాల్లో అరవ శ్రీధర్ అంశం చర్చకు వచ్చినట్లు సమాచారం. పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఇప్పటికే కొంతమంది నేతలు ఆయనను హెచ్చరించినట్లు తెలుస్తోంది.పార్టీ నుండి ఎలాంటి పిలుపు లేకపోయినా,



కీలక నాయకులు పాల్గొనే సభల్లో, కార్యక్రమాల్లో ఆయన ప్రత్యక్షం కావడం స్థానిక నేతలకు ఇబ్బందిగా మారింది. జనసేనను ఇరుకున పెట్టడానికి వైసిపి వంటి ప్రత్యర్థి పార్టీలకు అరవ శ్రీధర్ వ్యవహారం ఒక ఆయుధంగా మారింది. ఒకవైపు క్లీన్ ఇమేజ్ కోసం ప్రయత్నిస్తున్న జనసేనకు, అరవ శ్రీధర్ లాంటి వ్యక్తుల వల్ల కలిగే డ్యామేజ్ తక్కువేమీ కాదు.




## తిరుమలలో క్రెడిట్ వార్

**తిరుమల, మార్చి 23, పెన్ పవర్:** తిరుమలలో తాజాగా ప్రారంభమైన 'ఫుడ్ సేఫ్టీ ల్యాబ్' క్రెడిట్ విషయంలో ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. ఈ ల్యాబ్ ఏర్పాటు తన చొరవతోనే జరిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తప్పుడు ప్రచారం చేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. 'క్రెడిట్ చోరీ' చేయడంలో చంద్రబాబు కొత్త రికార్డులు సృష్టిస్తున్నారంటూ ఎద్దేవా చేసింది.జగన్ హయాంలోనే పునాది: గత జగన్ ప్రభుత్వ హయాంలోనే తిరుమల నాణ్యతా ప్రమాణాల కోసం ల్యాబ్ ఏర్పాటు చేయాలని ఖీూాూ×కి ప్రతిపాదనలు పంపినట్లు వైఎస్సార్‌సీపీ తెలిపింది.ఆగస్టు 2023లోనే ప్రకటన: దీనికి సంబంధించి ఆగస్టు 2023లో ఖీూాూ× సీఈఓ కమలవర్ధన్ రావు టీటీడీ అధికారులతో సమావేశమయ్యారని, ఆ రోజే ల్యాబ్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారని గుర్తు చేస్తూ ఒక వీడియోను విడుదల చేసింది.ట్విట్టర్ వేదికగా విమర్శలు: గత ప్రభుత్వం చేసిన కృషిని ఇప్పుడు తన ఖాతాలో వేసుకోవడం చంద్రబాబుకు అలవాటుగా మారిందని, ఇది ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని వైసీపీ ట్వీట్ చేసింది.తిరుమల లడ్డూ నెయ్యి కల్తీ వ్యవహారం దేశవ్యాప్తంగా కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో భక్తుల నమ్మకాన్ని కాపాడేందుకు సుమారు రూ. 20 కోట్ల వ్యయంతో, అత్యాధునిక పరికరాలతో టీటీడీ ఈ ల్యాబ్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీనిని సీఎం చంద్రబాబు ప్రారంభించగా, ఇది తమ హయాంలోనే మంజూరైన ప్రాజెక్టు అని వైసీపీ ఆధారాలతో సహా వాదిస్తోంది.

## కొత్త జిల్లాల వారీగా జడ్పీలకు రంగం సిద్ధం

**విజయవాడ, మార్చి 23, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో పాలనా వికేంద్రీకరణ దిశగా మరో కీలక అడుగు పడబోతోంది. కేవలం రెవెన్యూ జిల్లాలకే పరిమితం కాకుండా, స్థానిక సంస్థల పరిధిలోనూ సమూల మార్పులకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ముఖ్యంగా జిల్లా పరిషత్తుల పునర్విభజన ప్రక్రియ ద్వారా గ్రామీణ పాలనను మరింత ప్రజలకు చేరువ చేసేందుకు రంగం సిద్ధమైంది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 13 జిల్లాలను 26 జిల్లాలుగా మార్చినప్పుడు, అది కేవలం రెవెన్యూ, పోలీసు యంత్రాంగానికే పరిమితమైంది. కానీ, క్షేత్రస్థాయిలో నిధుల మంజూరు, గ్రామీణాభివృద్ధి పథకాల అమలులో కీలక పాత్ర పోషించే జిల్లా పరిషత్తులు మాత్రం పాత 13 జిల్లాల ప్రాతిపదికనే కొనసాగుతున్నాయి. ఇప్పుడు ఆ పరిస్థితి మారబోతోంది. కొత్తగా ఏర్పడిన మార్కాపురం, పోలవరం జిల్లాలతో కలిపి రాష్ట్రంలోని 28 జిల్లాల్లోనూ ప్రత్యేక జిల్లా పరిషత్తులను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.జిల్లా పరిషత్తుల పునర్విభజన కేవలం రాజకీయ నిర్ణయం మాత్రమే కాదు, అది ఒక రాజ్యాంగబద్ధమైన ఆవశ్యకత. ప్రస్తుత జడ్పీ పాలకవర్గాల గడువు ఈ ఏడాది సెప్టెంబరు 24తో ముగియనుంది. చట్టప్రకారం, గడువు ముగిసేలోపు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం ప్రకారం, ప్రతి జిల్లాకు ఒక జిల్లా పరిషత్తు ఉండాలి. ప్రస్తుతం ఉన్న 13 జడ్పీలు 28 జిల్లాలను కవర్ చేయడం సాంకేతికంగా, పరిపాలనాపరంగా ఇబ్బందికరంగా మారింది. 15వ ఆర్థిక సంఘం నిధులు లేదా ఇతర కేంద్ర పథకాల నిధులు జిల్లా జనాభా, భౌగోళిక విస్తీర్ణం ఆధారంగా జిల్లా పరిషత్తులకు అందుతాయి. కొత్త జడ్పీలు ఏర్పడితే, వెనుకబడిన ప్రాంతాలకు నిధులు నేరుగా అందే అవకాశం ఉంటుంది.ప్రస్తుతం ఈ ప్రక్రియ ముందున్న అతిపెద్ద సవాలు జనగణన. ఏప్రిల్ 1 నుంచి జనగణన ప్రారంభం కానున్న నేపథ్యంలో, కేంద్ర నిబంధనల ప్రకారం జిల్లాలు లేదా మండలాల సరిహద్దులను మార్చడానికి వీల్లేదు. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై కేంద్రానికి ప్రత్యేక విజ్ఞప్తి చేయాలని భావిస్తోంది. "కొత్త జిల్లాల్లో జడ్పీలు ఏర్పాటు చేయకపోతే ఎన్నికల నిర్వహణ సాధ్యం కాదు" అనే పాయింట్‌ను ప్రభుత్వం బలంగా వినిపించనుంది. కేంద్రం మినహాయింపు ఇస్తేనే, నోటిఫికేషన్ విడుదల చేసి జడ్పీల విభజనను పూర్తి చేసే అవకాశం ఉంటుంది.ప్రస్తుతం రాష్ట్రంలో 13 మంది జడ్పీ చైర్మన్లు మాత్రమే ఉన్నారు. పునర్విభజన జరిగితే ఆ సంఖ్య 28కి పెరుగుతుంది. ఇది రాజకీయంగా ద్వితీయ శ్రేణి నాయకత్వానికి పెద్దపీట వేస్తుంది. కలెక్టర్ కార్యాలయం ఒకచోట, జడ్పీ కార్యాలయం మరోచోట ఉండటం వల్ల ప్రస్తుతం సమన్వయ లోపం ఉంది. కొత్త జడ్పీలు వస్తే, జిల్లా అభివృద్ధి ప్రణాళికలు మరింత వేగంగా అమలు అవుతాయి. కొత్త జడ్పీల ఏర్పాటులో మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను మినహాయించి కేవలం గ్రామీణ ప్రాంతాలనే పరిగణనలోకి తీసుకుంటారు. దీనివల్ల గ్రామీణ సమస్యలపై ఫోకస్ పెంచే అవకాశం ఉంటుంది.

## మంత్రి పదవి కోసం స్పీడ్ తగ్గించారా

**నెల్లూరు, మార్చి 23,పెన్ పవర్:** కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. ఏపీ పాలిటిక్స్‌లో పరిచయం అక్కరలేని పేరు. 2014, 2019లో రెండుసార్లు వైసీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన కోటంరెడ్డి..గత ఎన్నికలకు ముందు ఫ్యాన్ స్విచ్ఛాఫ్ చేసి సైకిల్ ఎక్కారు. నెల్లూరు రూరల్‌లో మూడోసారి విజయం సాధించి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గుర్తింపు పొందారు. అలాంటి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఫైర్ బ్రాండ్ లీడర్‌గా..ఓవైపు వైసీపీని టార్గెట్ చేస్తూనే..మరోవైపు నియోజకవర్గ అభివృద్ధిపై ఫోకస్ పెడుతూ వచ్చారు. వందల కోట్ల నిధులతో నెల్లూరు రూరల్‌లో ఓ రేంజ్‌లో డెవలప్‌మెంట్ కార్యక్రమాలు చేపట్టి సీఎం చంద్రబాబుతో ప్రశంసలు పొందారు. పనితీరులో రాష్ట్రవ్యాప్తంగా 32వ స్థానం, నెల్లూరులో ఫస్ట్ ప్లేస్ సొంతం చేసుకున్న ఎమ్మెల్యే కోటంరెడ్డికి..విస్తరణలో మంత్రి పదవి పక్కా అంటూ ప్రచారం జరుగుతోంది. అందుకు తగ్గట్లే ఆయన కూడా దూకుడు పెంచుతూ వచ్చారు. కానీ కొన్ని రోజులుగా ఆయన తన రూట్‌ను మార్చినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.అయితే ఎమ్మెల్యే కోటంరెడ్డికి నెంబర్ వన్ ప్లేస్ దక్కడం..సీఎం చంద్రబాబు దగ్గర ప్రశంసలు పొందడం వెనుక ఎమ్మెల్యే కోటంరెడ్డి సోదరుడు గిరిధర్ రెడ్డి కృషి ఎంతో ఉందన్నది పబ్లిక్ టాక్. ఎమ్మెల్యే కోటంరెడ్డి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో లేనప్పుడు ఆ లోటు కనిపించకుండా గిరిధర్ రెడ్డి ప్రజల్లో తిరుగుతూ అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తున్నారట. ఒక్క మాటలో చెప్పాలంటే కోటంరెడ్డి గిరిధర్ రెడ్డే నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అని ప్రజలు చెప్పుకునేలా వందల కోట్లతో అభివృద్ధి పనులను దగ్గరుండి జరిపిస్తున్నారట. ఇలా కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి నియోజకవర్గంలో అభివృద్ధి పనులను పరుగులు పెట్టించడం వల్లే ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి మంచి పేరు, ప్రశంసలు దక్కుతున్నాయని తెలుగు తమ్ముళ్లే చర్చించుకుంటున్నారట.అయితే ఒక పక్క మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నప్పటికీ ఎమ్మెల్యే కోటంరెడ్డి నెక్ట్స్ టార్గెట్ తన తమ్ముడు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డిని ఎమ్మెల్యేను చేసుకోవడమేనట. ఇప్పటికే వచ్చే ఎన్నికల్లో నెల్లూరు రూరల్ నుంచి తాను పోటీ చేయనని తన తమ్ముడే ఎమ్మెల్యేగా పోటీ చేస్తారని పలు సందర్భాల్లో చెప్పారు కోటంరెడ్డి. సోదరుడిని ఎమ్మెల్యే చేసేందుకు అమాత్య ఆశలను కూడా అలా పక్కన పెట్టి..నియోజకవర్గంపైనే ఫుల్ ఫోకస్ పెట్టారట కోటంరెడ్డి.రెండేళ్లు పూర్తికాక ముందే నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో రూ.613 కోట్లతో చంద్రన్న రహదారులు, చంద్రన్న పార్కులు, చంద్రన్న వెలుగులు, బ్రిడ్జిల అభివృద్ధి పనుల జాతర చేపట్టారు ఎమ్మెల్యే కోటంరెడ్డి. ఎక్కడా అవినీతికి తావు లేకుండా..ప్రతి పైసా ఖర్చు వివరాలను ప్రజలకు తెలిపేలా ఒక బుక్ లెట్ తయారు చేసి పబ్లిక్ డొమెయిన్‌లో ఉంచారట. అభివృద్ధి పనులకు సంబంధించిన బుక్లెట్‌ను సీఎం చంద్రబాబుకు కూడా చూపించారట ఎమ్మెల్యే కోటంరెడ్డి. వీటిలో కొన్ని పూర్తి కాగా..ఇంకొన్ని చివరి దశలో..మరి కొన్ని టెండర్ల దశలో ఉన్నాయని అంటున్నారు. ఇటీవల 339 పనులను ఒకేసారి స్థానిక ప్రజలతో శంకుస్థాపన చేసి 60 రోజుల్లోనే పూర్తి చేసి రికార్డు సృష్టించారు కోటంరెడ్డి. మరోసారి రూ.27 కోట్లతో ఈ నెల 22న స్థానిక ప్రజల చేత 240 చోట్ల ఒకేసారి ప్రారంభోత్సవాలు చేసేందుకు సిద్ధమవుతున్నారట.పక్కా వ్యూహం ప్రకారమే నియోజకవర్గ డెవలప్‌మెంట్‌కు టాప్ ప్రయారిటీ ఇస్తున్నారట కోటంరెడ్డి. తనకు మంత్రి పదవి వస్తే సంతోషం. కానీ వచ్చే ఎన్నికల్లో తమ్ముడిని ఎమ్మెల్యే చేసి తీరాలని పట్టుదలతో ఉన్నారట. కోటంరెడ్డికి అమాత్య యోగం ఎప్పుడు దక్కుతుందో? సోదరుడిని ఎమ్మెల్యే చేసేందుకు ఆయన చేస్తున్న ప్రయత్నాలు ఎంతవరకు సక్సెస్ అవుతాయో చూడాలి.

# చంద్రబాబును బుక్ చేసిన చిరంజీవి

**విజయవాడ, మార్చి 23, పెన్ పవర్:** తెలంగాణలో గద్దర్ అవార్డుల ప్రదానోత్సవంలో మెగాస్టార్ చిరంజీవిచేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. ఆయన నోటి నుంచి వచ్చిన కొన్ని మాటలు అభ్యంతరకరంగా ఉన్నాయి. అనవసరంగా ఆయన ఆ వ్యాఖ్యలు చేశారా? అని అనిపించేలా ఉన్నాయి. ఆయనకు ఎన్టీఆర్ జాతీయ అవార్డు ఇచ్చారు. అయితే చిరంజీవి నందమూరి తారక రామారావు గురించి ఒక్క ప్రస్తావన కూడా చేయలేదు. ఆయన పేరుతో అవార్డు తీసుకున్నందుకు ఒకటి రెండు మాటలు అయినా చెప్పి ఉండాల్సింది. కానీ ఎందుకో చిరంజీవి ఎన్టీఆర్ ప్రస్తావన తీసుకురాలేదు. సహజంగానే ఏదైనా అవార్డులు ఎవరి పేరు మీద అయినా తీసుకుంటే వారి గురించి ప్రస్తావించడం అనేది ముఖ్యం. కానీ ఎందుకో చిరంజీవి ఆ విషయంలో పొరపాటు చేసినట్టు కనిపించారు. అయితే వెంటనే దానిని సరిదిద్దుకున్నారు. ఎన్టీఆర్ అవార్డు తీసుకోవడం పై ట్వీట్ చేశారు. ఆయన పేరుతో అవార్డు తీసుకోవడం పై ఆనందం వ్యక్తం చేశారు.అయితే అదే వేదికపై పక్క రాష్ట్రం అని ఏపీని ఉద్దేశించి చిరంజీవి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఆంధ్రప్రదేశ్ను పక్క రాష్ట్రం తో పోల్చడం ఏమిటని విమర్శలు వచ్చాయి. తెలంగాణ వేదికగా ఏపీ పక్క రాష్ట్రం కావచ్చు కానీ.. సాటి తెలుగు రాష్ట్రం. అందున సినిమా రంగానికి చెందిన వ్యక్తిగా ఆ మాట అనకూడదు. మరోవైపు కళారంగాన్ని ఆదరించడం, సినీ పరిశ్రమను ప్రోత్సహించడంలో పక్క రాష్ట్రం వెనుకంజలో ఉందని చిరంజీవి వ్యాఖ్యానించారు. అంటే నంది అవార్డులను ఇవ్వాలన్నది చిరంజీవి అభిమతం గా తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయ్యాయి..తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పక్కన ఉండగానే ఏపీ సీఎం చంద్రబాబు ప్రస్తావన తీసుకొచ్చారు చిరంజీవి. నంది అవార్డులను పునరుద్ధరించే విషయంలో చంద్రబాబు ఒక ఆలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా చంద్రబాబు నంది అవార్డులను నిలిపివేశారన్న అభిప్రాయం వచ్చేలా చిరంజీవి వ్యాఖ్యలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం గా పవన్ కళ్యాణ్ ఉన్నారు. ఆయన సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తి. ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకున్న పవన్ కళ్యాణ్ అభిప్రాయం తీసుకుంటూ వస్తుందనలో సందేహం లేదు. అందులోనూ సినీ పరిశ్రమకు సంబంధించిన పూర్తి వ్యవహారాలన్నీ పవన్ కళ్యాణ్ చూస్తారు. సినిమాటోగ్రఫీ మంత్రిగా జనసేనకు చెందిన కందుల దుర్గేష్ ఉన్నారు. ఆ ఇద్దరికీ చెబితే ఇట్టే పని జరిగిపోతుంది. కానీ చిరంజీవి మాత్రం చంద్రబాబు ప్రస్తావన తీసుకురావడం విమర్శలకు తావిస్తోంది. అనవసరంగా చంద్రబాబును ఇందులో ఇన్వాల్వ్



చేయడం ఏమిటనేది ఒక ప్రశ్న. ఏపీలో నంది అవార్డులను నిలిపివేసింది జగన్మోహన్ రెడ్డి. వాస్తవానికి తెలుగుదేశం 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత నంది అవార్డులను ఇచ్చింది. అయితే 2017లో మొత్తం నాలుగు సంవత్సరాలకు సంబంధించి అవార్డులను ప్రదానం చేశారు. కానీ ఆ సమయంలో సొంతవారికి అవార్డులు ఇచ్చుకున్నారు అన్న విమర్శలు వచ్చాయి. ఇదే సినీ పరిశ్రమకు చెందిన చాలామంది వ్యక్తులు విమర్శలు చేశారు.. అటు తరువాత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నంది అవార్డులను పూర్తిగా ఇవ్వలేదు. కానీ పరిశ్రమకు చెందిన వ్యక్తులు కనీసం నోరు తెరవలేదు. పోనీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తులు ఎవరు సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలవలేదు. అటువంటప్పుడు నంది అవార్డుల విషయంలో చిరంజీవి ప్రత్యేకంగా ఇప్పుడు ఏపీ ప్రభుత్వాన్ని చిన్నచూపు చూసి మాట్లాడడం ఏమిటనేది ప్రశ్న.రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ ప్రభుత్వం విషయంలో సినీ పరిశ్రమ ఒకలా ఉంటుంది. ఏపీ ప్రభుత్వం విషయంలో మరోలా వ్యవహరిస్తోంది. ఎందుకంటే తెలంగాణలో సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తుల ఆస్తులు, పెట్టుబడులు ఎక్కువగా ఉన్నాయి. అందుకే వారి ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. ప్రభుత్వం విషయంలో భయము ఉంటుంది. కానీ ఏపీ మాత్రం కేవలం ప్రేక్షక వర్గానితోపాటు వీక్షక వర్గానికి మాత్రమే పరిమితం అయింది. కేవలం ఆదాయం ఇస్తుందే తప్ప సినీ పరిశ్రమ పెద్దలకు ఇక్కడ ఆస్తులు లేవు. అందుకే ఏపీ ప్రభుత్వం పై నోరు మెదిపే సినీ పరిశ్రమ వ్యక్తులు.. తెలంగాణ ప్రభుత్వం పై మాత్రం చాలా జాగ్రత్తగా మాట్లాడుతారు. అయితే చిరంజీవి చివరిగా ఒక మాట చెప్పారు. సినీ పరిశ్రమను ప్రోత్సహిస్తేనే జీడీపీ పెరుగుతుందనేది చిరంజీవి వాదన. కానీ ఒక చిన్న పరిశ్రమ ఏడాది లావాదేవీలకు కూడా చిత్ర పరిశ్రమ సాటి రాదు అన్న విషయాన్ని గుర్తు చేసుకోవాలి. వేలాదిమందికి ఉపాధినిస్తుంది ఓకే. సంప్రదాయ సాంస్కృతిక రంగం సినిమా. అంతవరకు ఓకే కానీ.. రాష్ట్ర అభివృద్ధిలో కీలకం అన్న విషయం మాత్రం ఉత్తమాటే. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో చిత్ర పరిశ్రమ ఒక్కటే. నంది అవార్డుల పేరిట ఉన్న దానిని మార్చి గద్దర్ పేరిట ఇస్తున్నారు. ఇప్పుడు మళ్లీ ఏపీ ప్రభుత్వం ఇస్తే ఆ అవార్డులకు పెద్దగా ప్రాధాన్యం ఉండదు. బహుశా ఏపీ ప్రభుత్వం ఆ ఆలోచనతోనే నంది అవార్డులను పునరుద్ధరించలేదు. కానీ చిరంజీవి వేదికపై యధాలపంగా మాట్లాడిన వ్యాఖ్యలు ఇంతటి దుమారానికి దారి తీయడం మాత్రం ఆందోళన కలిగిస్తోం

# కన్నబాబుకు వ్యతిరేకంగా కాంట్రాక్టర్లు...

**విజయవాడ, మార్చి 23, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజధా ని అమరావతి పనులు ఊపందుకున్నాయి. ఈ పనులు ఇదే వేగంతో కొనసాగాలని, 2029 ఎన్నికల నాటికి అమరావతి పూర్తి చేయాలని చాలా మంది కోరుకుంటున్నారు. అయితే ఇలాంటి సమయంలో ఏపీసీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు బదిలీ కావడం రాజకీయ, పరిపాలనా వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది. 2025 జనవరిలో బాధ్యతలు చేపట్టిన ఆయన, కేవలం 14 నెలల కాలంలోనే బదిలీ కావడం ఆశ్చర్యం కలిగిస్తోంది. అంతకుముందు ఉన్న కాటమనేని భాస్కర్ కూడా కేవలం 7-8 నెలలు మాత్రమే పనిచేశారు. అమరావతి వంటి భారీ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఇలా తరచుగా కమిషనర్లను మార్చడం వల్ల పనుల వేగంపై ప్రభావం పడుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.కన్నబాబు బదిలీ వెనుక అధికారికంగా ఎలాంటి సమాచారమూ లేదు. అయితే ఆయన బదిలీకి అనేక కారణాలున్నాయని అమరావతి వర్గాలు చెప్తున్నాయి. ముఖ్యంగాకన్నబాబు అమరావతి పనులను పర్యవేక్షించడానికి ఒక 'డాష్ బోర్డు'ను ఏర్పాటు చేశారు. దీని ద్వారా ఏ కాంట్రాక్టర్ ఎంత శాతం పని పూర్తి చేశారో స్పష్టంగా తెలిసేది. కొంతమంది కాంట్రాక్టర్లు కేవలం 5 నుంచి 20శాతం మాత్రమే పనులు పూర్తి చేసినట్లు ఇందులో తేలింది. ఈ పారదర్శకత వల్ల ఇబ్బంది పడ్డ కొందరు కాంట్రాక్టర్లు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారని సమాచారం.కన్నబాబు ప్రవేశపెట్టిన కొత్త సాఫ్ట్‌వేర్ విధానం వల్ల కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులో ఆలస్యం జరుగుతోందని, దీనిపై వారు సీఎం కార్యాలయానికి ఫిర్యాదు చేశారని తెలుస్తోంది. మాజీ సీఎస్ ఒకరు కొందరు ఐఏఎస్ అధికారులతో నిర్వహించిన రహస్య సమావేశానికి కన్నబాబు హాజరయ్యారనే రూమర్ కూడా ఉంది, అయితే ఇందులో ఎంతవరకు నిజం ఉందనేది తెలీదు. ప్రారంభంలో ఆయనపై రైతుల సమస్యల పట్ల అవగాహన లేదనే విమర్శలు వచ్చాయి. అయితే తర్వాత ఆయన చాలా సమస్యలను పరిష్కరించారు. అయినా ఆయన బదిలీ కావడం పలువురిని ఆశ్చర్యపరిచింది.అమరావతి నిర్మాణం అంటే కేవలం రోడ్లు, బిల్డింగ్‌లే కాదు.. ఇందులో భూ సమీకరణ, పర్యావరణ అంశాలు, టెక్నికల్ ఇష్యూస్ వంటి ఎన్నో సంక్లిష్టతలు ఉన్నాయి. కన్నబాబు స్థానంలో విజయరామరాజు నియమితులయ్యారు. ఆయన ఎంత సమర్థుడైనప్పటికీ, ఇంతటి సంక్లిష్టమైన ప్రాజెక్టుపై పూర్తి అవగాహన పెంచుకోవడానికి కనీసం ఏడాది సమయం పట్టవచ్చు. ఇది పనుల పురోగతిని మందగించేలా చేసే అవకాశం ఉంది. ఒక కీలకమైన ప్రాజెక్టు పూర్తి కావాలంటే కనీసం 3-4 ఏళ్ల పాటు ఒకే కమిషనర్‌ను కొనసాగిస్తే బాగుంటుంది.

ఇలా తరచూ మార్పులు చేయడం వల్ల ప్రాజెక్టు లక్ష్యాలు దెబ్బతినే ప్రమాదం ఉంది.అయితే కన్నబాబు ఆకస్మిక బదిలీ వెనుక అనేక రకాల ప్రచారాలు ఉన్నాయి. అధికార వర్గాల్లో సైతం విస్మయం వ్యక్తం అవుతోంది. రాజకీయ కారణాలతోనే కన్నబాబు బదిలీ జరిగిందన్నది ప్రధాన అనుమానం. ఇటీవల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో సిఎస్ గా పనిచేసిన వ్యక్తి ఒక ఉన్నత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు అవసరమైన సలహాలు సూచనల కోసమే ఈ సమావేశం పెట్టినట్లు ప్రచారం నడుస్తోంది. ఈ సమావేశానికి కన్నబాబు హాజరయ్యారని ఒక టాక్ అయితే ఉంది. ఇది తెలిసి ప్రభుత్వం వేటు వేసిందని ప్రచారంలో ఉంది. కానీ ఒక ఐఏఎస్ అధికారిగా సిఆర్డిఏ కమిషనర్ లాంటి పెద్ద పోస్టులో ఉండడం గొప్ప విషయం. అంతకంటే ఇంకా ఏం కావాలని ఆయన జగన్మోహన్ రెడ్డి ప్రాపకం కోసం ప్రయత్నిస్తారు అనేది ఒక అనుమానమే. అది అంత మాత్రం వాస్తవం కాదన్న వారు ఎక్కువ మంది ఉన్నారుమరోవైపు అమరావతి రైతుల నుంచి ఫిర్యాదులు రావడంతోనే కన్నబాబును మార్చారన్న ప్రచారం ఉంది. అయితే ఈ విషయంలో మాత్రం వాస్తవం ఉంది. కన్నబాబు ప్రారంభంలో బాధ్యతలు తీసుకున్న సమయంలో ఇటువంటి ఫిర్యాదులు వచ్చాయి. కానీ వాటన్నింటినీ అధిగమించి కన్నబాబు బాగానే సెట్ అయ్యారు సి ఆర్ డి ఏ కమిషనర్ గా. మరోవైపు కాంట్రాక్టర్ల ఫిర్యాదు నేపథ్యంలోనే బదిలీ చేశారన్న వాదన ఉంది. ఇటీవల కన్నబాబు ఒక సాఫ్ట్వేర్ తయారు చేశారు. అమరావతి పనులకు సంబంధించిన ప్రగతి ఎప్పటికప్పుడు గుర్తించే సాఫ్ట్వేర్ అన్నమాట. ఒక డాష్ బోర్డు మాదిరిగా ఆ సాఫ్ట్వేర్ తయారు చేశారు. అయితే దీనిపై కాంట్రాక్టర్లు ఆవేదనతో ఉన్నారు. ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడంతోనే కన్నబాబును తొలగించారు అన్నది ఒక వాదన.అమరావతి రాజధాని అనేది ఒక వ్రతంలా చేయాలి. ఒక ఉద్యమంలా నిర్మాణం చేపట్టాలి. దేశంలోనే అతిపెద్ద ప్రాజెక్టు అది. అటువంటి ప్రాజెక్టుకు సిఆర్డిఏ కమిషనర్ కీలకం. కానీ ఇలా ఎప్పటికప్పుడు కమిషనర్లు మార్చడం ద్వారా ఆ ప్రభావం పనులపై పడుతుంది. ప్రభుత్వం ఈ విషయంలో మాత్రం సరైన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇప్పటికీ అమరావతి రాజధాని పనుల్లో జాప్యం జరుగుతోందన్న విమర్శలు వస్తున్నాయి. ఇటువంటి సమయంలో రకరకాల కారణాలు చెప్పి కమిషనర్లను మార్చడం మాత్రం సహేతుకం కాదని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

## ముస్తాఫిజుర్ వివాదం: మా తప్పు తెలుసుకున్నాం.. భారత్‌తో ఫ్రెండ్లీ రిలేషన్స్ ముఖ్యం అంటున్న బంగ్లా




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ లో మా వాళ్లు ఆడరు.. ఐపీఎల్ ను మేము బహిష్కరిస్తున్నాం.. అంటూ బీరాలు పలికిన బంగ్లాదేశ్ పీచమణిగినట్లుంది. ముస్తాఫిజుర్ రెహమాన్ వివాదంతో భారత్ పై తీవ్ర నిందలు వేసి.. ఎట్టకేలకు గత్యంతరం లేక దిగొచ్చింది. మేము భారత్ తో ఫ్రెండ్లీ రిలేషన్స్ కోరుకుంటున్నాం అంటూ ప్రకటించింది. లేటెస్టుగా బంగ్లా స్పోర్ట్స్ మినిస్టర్ ఇండియాతో స్నేహపూర్వక సంబంధాలను కోరుకుంటున్నట్లు ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. రానున్న రోజుల్లో ఇండియాతో సంబంధాల పునరుద్ధరణకు ప్రయత్నిస్తామని పేర్కొన్నారు.

**ముస్తాఫిజుర్ వివాదం:**

బంగ్లాలో హిదువులపై దాడుల తర్వాత.. ఆ దేశానికి చెందిన ప్లేయర్లను ఐపీఎల్ నుంచి తొలగించాల్సిందిగా తీవ్ర ఒత్తిడి పెరిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఖఖ= టీమ్ నుంచి బంగ్లా స్టార్ బౌలర్ ముస్తాఫిజుర్ రెహమాన్ ను రిలీజ్ చేసింది. వాస్తవానికి 2026 ఐపీఎల్ కోసం ముస్తాఫిజుర్ ను 9 కోట్ల రూపాయలకు కేకేఆర్ దక్కించుకుంది. కానీ దేశ ప్రజల నుంచి విమర్శలు, ఒత్తిడి కారణంగా రిలీజ్ చేయాల్సిందిగా బీసీసీఐ ఆదేశించింది. దీంతో కేకేఆర్ అతన్ని వదులుకుంది.

**ఐసీసీ షాక్:**

దీంతో బీసీసీఐ పై బంగ్లాదేశ్ తీవ్ర విమర్శలు చేసింది. ఇండియాలో ఐపీఎల్ లో మా ప్లేయర్లు ఆడరని ప్రకటించింది. అదే విధంగా టీ20 వరల్డ్ కప్ ను ఇండియా నుంచి శ్రీలంకకు తరలించాల్సిందిగా ఐసీసీని డిమాండ్ చేసింది. బంగ్లా ఒత్తిడికి తలొగ్గకుండా షెడ్యూల్ లో ఎలాంటి మార్పు చేయలేదు. అదే విధంగా టీర్నీ నుంచి బంగ్లా ఎలిమినేట్ కావాల్సి వచ్చింది. బంగ్లా ప్లేస్ లో స్కాట్లాండ్ ఆడింది.

వరుస పరిణామాలు బంగ్లాదేశ్ కు చెంపపెట్టుగా మారాయి. టీ20 టోర్నీ నుంచి నిష్క్రమణ, ఐసీసీ షాకివ్వడం తర్వాత.. క్రికెట్ విషయంలో మొదటికే మోసం

వచ్చేలా ఉందని బంగ్లాకు ఇన్నాళ్లకు తెలిసొచ్చింది. క్రికెట్ నుంచి వచ్చే ఆదాయం కూడా కోల్పోతే దేశం మరింత సంక్షోభంలోకి వెళ్తుందన్న భయాందోళనలతో కాబోలు.. ఇండియాతో స్నేహం కోరుకుంటున్నామని ఆ దేశ క్రీడా శాఖ మంత్రి ప్రకటించారు.

# కరన్ ప్లేస్ లో రాయల్స్ జట్టులోకి షనక!

**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీలంక టీ20 టీమ్ కెప్టెన్ దసున్ షనక ఐపీఎల్ 19వ సీజన్ ఆరంభానికి ముందు రాజస్తాన్ రాయల్స్ జట్టులో చేరనున్నాడు. గాయం కారణంగా ఈ సీజన్ మొత్తానికి దూరమైన ఇంగ్లండ్ స్టార్ ఆల్‌రౌండర్ సామ్ కరన్ స్థానంలో షనకను రాయల్స్ తమ జట్టులోకి తీసుకోనుంది. ప్రస్తుతం పాకిస్తాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్)లో లాహోర్ ఖలందర్స్ తరఫున ఆడుతున్న షనక త్వరలోనే గువాహటిలో రాయల్స్ జట్టుతో కలవనున్నాడు. ఇప్పటికే జింబాబ్వే పేసర్ బ్లెస్సింగ్ ముజరబానీ కేకేఆర్ కోసం పీఎస్ఎల్ ఒప్పందాన్ని రద్దు చేసుకోగా, ఇప్పుడు షనక కూడా అదే బాట పట్టడం ఆ లీగ్‌కు పెద్ద ఎదురుదెబ్బగా మారింది. షనకకు సంబంధించిన పేపర్‌వర్క్ ప్రస్తుతం తుది దశలో ఉందని, అది పూర్తి కాగానే అతను ఇండియాకు చేరుకుంటాడని రాయల్స్ టీమ్ వర్గాలు తెలిపాయి.




# 60 ఏళ్లొచ్చినా ఆడతానేమో.. ధోనీ సరదా వ్యాఖ్యలతో హోరెత్తిన చెపాక్..

**హైదరాబాద్ పెన్ పవర్:** చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) దిగ్గజ ఆటగాడు, మిస్టర్ కూల్ ఎంఎస్ ధోనీ తన రిటైర్మెంట్‌పై మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేసి అభిమానుల్లో ఉత్సాహం నింపారు. ఐపీఎల్‌లో 60 ఏళ్ల వయసు వచ్చినా ఆడుతూనే ఉంటానేమోనంటూ ఆయన చేసిన సరదా వ్యాఖ్యలు చెపాక్ స్టేడియాన్ని హోరెత్తించాయి. ప్రస్తుతం 44 ఏళ్ల వయసులో ఉన్న ధోనీ, తన భవిష్యత్తు ప్రణాళికలపై జరుగుతున్న ఊహాగానాలకు ఈ వ్యాఖ్యలతో మరింత ఆసక్తిని జోడించారు. చెపాక్‌లో నిన్న జరిగిన సీఎస్‌కే ఫ్యాన్ ఈవెంట్‌లో ఈ సరదా సంభాషణ చోటుచేసుకుంది. ఈ కార్యక్రమానికి హాజరైన నటుడు శివకార్తికేయన్, రిటైర్మెంట్ ఆలోచనలు పక్కనపెట్టి మరికొన్నేళ్లు సీఎస్‌కే పసుపు జెర్సీలో కొనసాగాలని ధోనీని కోరారు. దీనికి ధోనీ నవ్వుతూ బదులిస్తూ... “ప్రస్తుతం 44 ఏళ్ల వయసులో ఫిట్‌నెస్ కాపాడుకోవడం చాలా కష్టంగా ఉంది. అయినా కంగారు పడకండి... నేను 60 ఏళ్ల వరకు ఆడినా ఆశ్చర్యపోవద్దు” అని అన్నారు. ఈ మాటలకు స్టేడియంలోని అభిమానుల నుంచి భారీ స్పందన వచ్చింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

వాస్తవానికి ఐపీఎల్ 2026 సీజన్ మొత్తానికి ధోనీ అందుబాటులో ఉంటాడని సీఎస్‌కే సీఈవో కాశీ విశ్వనాథన్ ఇప్పటికే స్పష్టం చేశారు. అయితే, జట్టులో ఆయన పాత్ర క్రమంగా మారుతోంది. 2024 సీజన్‌కు ముందు కెప్టెన్సీ




బాధ్యతల నుంచి తప్పుకున్న ధోనీ, రుతురాజ్ గైక్వాడ్‌కు పగ్గాలు అప్పగించారు. ప్రస్తుతం ఆయన ప్రధానంగా ఫినిషర్ పాత్రకే పరిమితమయ్యారు. ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధన, జట్టులోకి సంజు శాంసన్ వంటి ఆటగాళ్లు రావడంతో భవిష్యత్తులో వికెట్ కీపింగ్ బాధ్యతలు కూడా పంచుకునే అవకాశం కనిపిస్తోంది. ఐపీఎల్ 2025 సీజన్‌లో పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచి తీవ్రంగా నిరాశపరిచిన సీఎస్‌కేకు, ఈ దశలో ధోనీ అనుభవం ఎంతో కీలకం. రుతురాజ్ గైక్వాడ్ నాయకత్వంలో జట్టును పునర్నిర్మించే క్రమంలో 2026 సీజన్ ఈ దిగ్గజ ఆటగాడికి ఘనమైన వీడ్కోలు పలికే చివరి అధ్యాయం కావొచ్చని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు. ఏదేమైనా ధోనీ క్రీజులో ఉన్నంత వరకు అభిమానులకు పండగే.

# ఎస్కలేటర్‌పై దిశా పటానీ టాప్ యాంగిల్ సరికాదేమో!



ప్రస్తుతం ముంబైలో జరుగుతున్న లక్మే ఫ్యాషన్ వీక్ గ్లామర్ ప్రపంచంలో హాట్ టాపిగ్గా మారింది. ఈ వేదికపై బాలీవుడ్ బ్యూటీ దిశా పటానీ తనదైన శైలిలో ర్యాంప్ వాక్ చేస్తూ అందరి దృష్టిని ఆకర్షించారు. అదిరిపోయే డిజైనర్ దుస్తుల్లో దిశా మెరిసిన తీరు ఫ్యాషన్ ప్రియులను మంత్రముగ్ధులను చేసింది. దిశాతో పాటు మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా వంటి టాప్ హీరోయిన్లు కూడా ఈ వేడుకలో పాల్గొని తమ తళుకుబెళు కులతో మురిపించారు. అయితే ఈ వేడుకలో దిశా పటానీకి సంబంధించిన ఒక వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో విమర్శలకు దారితీసింది. దిశా వేదికకు వెళ్లకకు వెళ్లే ముందు ఎస్కలేటర్ పై వెళుతుంటే.. ఒక వ్యక్తి తనను -టాప్ యాంగిల్-లో వీడియో తీయడం చర్చనీయాంశమైంది. ఒక దురభిమాని చేసిన ఈ పనిని నెటిజన్లు తీవ్రంగా తప్పుబడుతున్నారు. అభిమానం పేరుతో ఇలాంటి పనులు చేయడం ఏమాత్రం సరికాదని.. దీనిని -దురభిమానం-గా భావించాలని సోషల్ మీడియా వేదికగా మండిపడుతున్నారు. కథానాయికలు పబ్లిక్ ప్రాపర్టీ కాదు.. వారికి కూడా వ్యక్తిగత స్వేచ్ఛ, గౌరవం ఉంటాయని నెటిజన్లు హితవు పలుకుతున్నారు. వారు ధరించే దుస్తుల విధానాన్ని బట్టి వారిని తక్కువ చేసి చూడకూడదని.. సెలబ్రిటీల విషయంలో కనీస గౌరవంతో వ్యవహరించాలని సూచిస్తున్నారు. అసభ్యంగా ఫోటోలు తీయడం, రహస్యంగా వీడియోలు తీయడం వంటి చర్యలు నేటి డిజిటల్ యుగంలో పెరిగిపోతున్నాయని.. ఇలాంటి వికృత చేష్టలను కచ్చితంగా నిరసించాల్సిందేనని అభిప్రాయపడుతున్నారు. ఇక లక్మే ఫ్యాషన్ వీక్ విషయానికి వస్తే.. గత కొద్ది రోజులుగా ఈ ఈవెంట్ ముంబైలో ఎంతో ఘనంగా సాగుతోంది. ఈ ఏడాది ఫ్యాషన్ వీక్ ఐదు రోజుల పాటు జరగనుంది. ఇప్పటివరకు దిశా పటానీ, తమన్నా భాటియా, సారా అలీ ఖాన్, అనన్యా పాండే వంటి దాదాపు 15 మందికి పైగా అగ్ర కథానాయికలు పలు టాప్ బ్రాండ్ల తరపున ర్యాంప్ వాక్ చేసి సందడి చేశారు. మరో రెండు రోజుల్లో మరికొంతమంది స్టార్ సెలబ్రిటీలు ఈ వేదికపై మెరిసే అవకాశం ఉంది. ఫ్యాషన్ షోలు అనేవి కళను, సృజనాత్మకతను ప్రదర్శించే వేదికలు. అక్కడ నటీనటుల అందాన్ని ఆస్వాధించడంలో తప్పులేదు కానీ.. వారి గౌరవానికి భంగం కలిగించేలా ప్రవర్తించడం సభ్యసమాజానికి మంచిది కాదు. దిశా పటానీ వీడియో విషయంలో వ్యక్తమవుతున్న నిరసన.. భవిష్యత్తులోనైనా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలని కోరుకుందాం. ఇక కెరీర్ మ్యాటర్ కి వస్తే.. దిశా పటానీని చివరిగా తెలుగు ఆడియెన్ కల్కి 2898 ఏడి, కంగువ చిత్రాలలో వీక్షించారు. మళ్లీ ఎప్పుడు ఈ భామ సౌత్ లో కనిపిస్తుందో వేచి చూడాల్సి ఉంది. ఫ్లాపుల కారణంగా.. అటు హిందీలో ఈ భామ కెరీర్ అంతంత మాత్రంగానే సాగుతోంది.





Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D. No. 41-1/5-1, Srinivasa Tower, Flat No. S2, Gowthami Nagar, Krishnalanka, Vijayawada, NTR Dist. editor GANTYADA APPARAO. PRGI Registration No. " APTEL/25/A4561" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965